ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
బుధవారం 21 మే 2025

100 అడుగుల జాతీయ జెండాతో రాజంపేటలో చేస్తున్న తిరంగా ర్యాలీ



దేశభక్తి ఉప్పొంగేలా తిరంగా ర్యాలీ

● భారత్ మాతాకీ జై నినాదాలతో హోరెత్తిన రాజంపేట

రాజంపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయంతో సైన్యానికి మద్దతుగా 100 అడుగుల జాతీయజెండాతో పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహం నుంచి మార్కెట్ మీదుగా పాతబస్టాండు కూడలి, బైపాస్, ఎన్టీఆర్ విగ్రహం వరకు జరిగిన తిరంగా ర్యాలీ విజయవంతమైంది. పట్టణంలోని అధికారులు, నాయకులు, మహిళలు, మైనార్టీ నాయకులు, వ్యాపారవేత్తలు 100 అడుగుల జాతీయ జెండాను చేతబట్టుకుని ఉత్సాహంతో దేశభక్తి పాటలు పాడుతూ వీరమరణం పొందిన మురళీనాయక్ అమర్ రహే, భారత్ మాతాకీ జై అంటూ రాజంపేటను నినాదాలతో హోరెత్తించారు. చిన్నారులు భరతమాత వేషాలు వేసి దేశభక్తిని చాటుకున్నారు. టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, బీజేపీ కార్యవర్గ సభ్యులు పోతుగుంట రమేష్‌నాయుడు, జనసేన నేత యల్లటూరు శ్రీనివాసరాజు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దెపల్లె ప్రతాప్‌రాజులు మాట్లాడుతూ కశ్మీర్ పెహల్గాం సంఘటనలో ఉగ్రవాదులు అమాయకులైన 26 మందిని అతి కిరాతకంగా చంపారని, అందుకు ప్రతిదాడిగా పాకిస్థాన్‌లోని ఉగ్రశిబిరాలపై మన సైనికులు సాహసోపేతమైన దాడులు నిర్వహించి ప్రపంచానికి మన సత్తాను చాటి చెప్పారన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నేతలు అబూబకర్, గుల్జార్‌బాషా, కూటమి నేతలు బాసినేని వెంకటేశ్వర్లునాయుడు, బాపనయ్యనాయుడు, క్రిష్ణయాదవ్, గన్నే సుబ్బనరసయ్య, కొల్లి రెడ్డయ్య, సునీత, మందపల్లె శ్రీను, ఆదినారాయణ, తోట నగేష్, టెక్స్‌మో మల్లి, రవినాయుడు, శివనారాయణచౌదరి, ఉద్యోగులు, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, మాజీ సైనికులు, మున్సిపల్ ఉద్యోగులు, విద్యార్థులు, ప్రైవేటు ప్రభుత్వ ఆసుపత్రిలోని డాక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇక.. పుంగనూరు అన్నమయ్యదే

చిత్తూరు జిల్లాలో ఉన్న పుంగనూరు నియోజకవర్గం ఇక అన్నమయ్య జిల్లాలో చేరనుంది. ఈ మేరకు మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ శాఖ ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. ఈ నిర్ణయం వల్ల జిల్లాలో రాజకీయ సమీకరణలు మారనున్నాయి. పరిపాలనా సౌలభ్యం కోసం పుంగనూరును అన్నమయ్యలోకి కలుపుతున్నారని చెబుతున్నప్పటికీ రాజకీయ కారణాలే అనే చర్చ సర్వత్రా నడుస్తోంది.

● రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం..
● ఇక జిల్లాలో 35 మండలాలు..
● మారనున్న రాజకీయ సమీకరణాలు


(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో 2022లో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాల పునర్విభజన జరిగింది. పార్లమెంటరీ స్థానం ఆధారంగా జిల్లాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినా పలు చోట్ల అశాస్త్రీయంగా విభజన జరిగిందనే విమర్శలు ఉన్నాయి. ఇందుకు పుంగనూరు నియోజకవర్గాన్ని చిత్తూరులో చేర్చడమే ఉదాహరణగా చెప్పుకోవచ్చు. వాస్తవానికి రాజంపేట పార్లమెంటు పరిధిలో రైల్వేకోడూరు, రాజంపేట, రాయచోటి, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాలు ఉన్నాయి. అయితే అప్పటి రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒత్తిడి మేరకు పుంగనూరును చిత్తూరులో కలిపారు. దీనిపై ప్రజల నుంచి అభ్యంతరాలు వ్యక్తమైనా అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభ్యంతరాలను పట్టించుకోలేదు. పుంగనూరు నియోజకవర్గాన్ని చిత్తూరు జిల్లాలో కలపడంతో మదనపల్లె రెవెన్యూ డివిజన్‌కు సమీపంలోనే ఉన్న పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం, రొంపిచెర్ల మండలాల ప్రజలు తమ అవసరాల కోసం కొత్తగా ఏర్పడిన పలమనేరు రెవెన్యూ డివిజన్‌కు వెళ్లాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజల ఇబ్బందులను గుర్తించిన ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పుంగనూరును అన్నమయ్య జిల్లాలో కలిపేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు ఈ మేరకు ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలో 30 మండలాలు ఉండగా పుంగనూరు నియోజకవర్గం కలవడంతో వాటి సంఖ్య 35కు చేరనుంది.

మంత్రివర్గ ఆమోదం..

చిత్తూరు జిల్లా పరిధిలోని పుంగనూరు నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లాకు బదిలీ చేయడానికి రాష్ట్ర మంత్రివర్గం మంగళవారం ఆమోదముద్ర వేసింది. ప్రస్తుతం పుంగనూరు నియోజకవర్గంలోని పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం మండలాలు చిత్తూరు జిల్లా పలమనేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోనూ రొంపిచెర్ల చిత్తూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోనూ ఉన్నాయి. ఈ నేపథ్యంలో రెవెన్యూ శాఖ ఆంధ్రప్రదేశ్ జిల్లాల ఏర్పాటు చట్టం, 1974లోని సెక్షన్ 3, సబ్-సెక్షన్ (5) ప్రకారం పుంగనూరు నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లా మదనపల్లె రెవెన్యూ డివిజన్‌కు బదిలీ చేయడానికి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయడానికి రెవెన్యూ శాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్రమంత్రి వర్గం ఆమోదం తెలిపింది.

మారనున్న రాజకీయ సమీకరణాలు

పుంగనూరు నియోజకవర్గాన్ని అన్నమయ్య జిల్లాలో కలపడం వల్ల రాజకీయ సమీకరణాలు మారనున్నాయి. ప్రస్తుతం రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుమారుడు మిధున్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి సోదరుడు ద్వారకనాథరెడ్డి ఉన్నారు. పుంగనూరు ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉన్నారు. జిల్లాల పునర్విభజన జరగకముందు రాజంపేట పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గాలతో పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనూ పెద్దిరెడ్డి హవా కొనసాగేది. అయితే పార్లమెంటరీ స్థానం ప్రతిపాదికన జిల్లాల ఏర్పాటు జరగనుండడంతో చిత్తూరు జిల్లాపై పట్టు కోల్పోతామనే ఉద్దేశ్యంతో పెద్దిరెడ్డి పుంగనూరు నియోజకవర్గాన్ని చిత్తూరులో చేర్పించారు. దీంతో అటు అన్నమయ్య, ఇటు చిత్తూరు జిల్లాల్లో వైసీపీ పాలనలో పెద్దిరెడ్డి పెత్తనం కొనసాగింది. దీనికి చెక్ పెట్టి అన్నమయ్య జిల్లాకే పరిమితం చేసేందుకు ప్రభుత్వ పెద్దలు పుంగనూరును చిత్తూరు నుంచి తొలగిస్తున్నట్లు తెలుస్తోంది. వైసీపీ పాలనలో జరిగిన జిల్లాల పునర్విభజనపై రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల ప్రజల నుంచి తీవ్ర అభ్యంతరాలు ఉన్నాయి. తాము అధికారంలోకి వస్తే ప్రజల కోరిక మేరకు జిల్లాల్లో కొన్ని మార్పులు, చేర్పులు చేస్తామని గతంలో చంద్రబాబు, నారా లోకేశ్‌లు ప్రకటించి ఉన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మొట్టమొదట కూటమి ప్రభుత్వం చిత్తూరు జిల్లాలో మార్పులు చేసింది.



నేటి నుంచి బదిలీల ప్రక్రియ ప్రారంభం

కడప ఎడ్యుకేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ యాజమాన్యాలలో పనిచేస్తున్న గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల బదిలీల ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభం కానుందని డీఈవో షంషుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. తప్పనిసరి బదిలీ అయ్యేవారు, అభ్యర్థన బదిలీ కోరేవారు బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో బదిలీకోసం దరఖాస్తు చేసుకునేందుకు సన్నద్ధంగా ఉండాలని సూచించారు.

ఐదుగురు పీఆర్ రిటైర్డు ఇంజనీర్లకు భారీ జరిమానా

● నిధుల రికవరీతో పాటు పెన్షన్‌లలో కోత
● కమలాపురం మండలంలో జరిగిన పనుల్లో అక్రమాల ఫలితం

6

ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు కల్పించండి

● ఆర్టీసీ బస్టాండు తనిఖీలో కలెక్టర్ చామకూరి శ్రీధర్



ఆర్టీసీ బస్టాండును పరిశీలిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాజంపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ఆర్టీసీ బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆర్టీసీ డీఎం రమణయ్యను ఆదేశించారు. రాజంపేట బస్టాండును కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్ అధ్వానంగా ఉండటంతో డీఎంను ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే మీ పద్ధతి మార్చుకుని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. బస్టాండు ఆవరణంలో ఉన్న పరిసరాలను పరిశీలించారు. బస్టాండులో పారిశుధ్యం, మరుగుదొడ్లు సరిగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్టాండుకు ఏయే ప్రాంతాల నుంచి బస్సులు వస్తాయి, ప్రయాణికుల ఆక్యుపెన్సీ ఎంత, తదితర వివరాలను ఆర్టీసీ డీఎం, ఆర్ఎంలను అడిగి తెలుసుకున్నారు. బస్టాండు లోపల, పరిసర ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని పక్కాగా నిర్వహించాలని ఆర్టీసీ అధికారులు, మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. బస్టాండులో మెరుగైన సేవలు అందించడానికి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని ఆర్ఎంకు తెలిపారు.

ప్రతిరోజూ చెత్త సేకరణ చేయాలి

రాజంపేట మండలం కూచివారిపల్లె పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. పంచాయతీ పరిధిలో ఎన్ని హ్యాబిటేషన్స్ ఉన్నాయి, ఎంతమంది క్లాప్‌మిత్రలు ఉన్నారు, రోజువారీ చెత్త సేకరణ చేస్తున్నారా, ఎన్ని వాహనాలు ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. 3800 కుటుంబాలు ఉంటే ఐదుగురితో చెత్త సేకరణ ఎలా సాధ్యమవుతుందని, క్లాప్‌మిత్రల సంఖ్యను పెంచుకోవాలని తెలిపారు. తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించాలని, ఈ విషయమై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఈ సందర్భంగా కూచివారిపల్లెలో కాటుకూటి వెంకటరమణయ్య ఇంటికి వెళ్లి చెత్త సేకరణ జరుగుతుందా లేదా అని, ప్రతినెలా 1వ తేదీన పింఛను అందుతుందా, ఇంటి వద్దకే వచ్చి పింఛను ఇస్తున్నారా అని ఆరా తీశారు. వారానికి మూడు రోజుల పాటు చెత్త తీసుకెళుతున్నారని, పింఛను ప్రతినెలా 1వ తేదీ ఇంటికి వచ్చి ఇస్తున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాజంపేట సబ్‌కలెక్టర్ నిదియాదేవి, తహసీల్దార్ పీర్‌మున్నీ, ఆర్టీసీ ఆర్ఎం రాము, రాజంపేట మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, ఎంపీడీవో కార్యాలయ ఏవో బాలమునిస్వామి, డీఎల్పీవో, కూచివారిపల్లె సర్పంచ్, వార్డు మెంబర్లు, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రూపురేఖలు మారనున్న హిల్స్



హార్సిలీహిల్స్ ఎంట్రెన్స్‌లో ఆర్చి నిర్మాణంపై సూచనలిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

● హార్సిలీహిల్స్‌లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
● పర్యాటకుల ఆకర్షణ దిశగా మారనున్న హిల్స్ రూపురేఖలు
● ఒబెరాయ్ హోటల్ నిర్మాణంపై కసరత్తు
● జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

బి.కొత్తకోట, మే 20 (ఆంధ్రజ్యోతి): పర్యాటకులను ఆకర్షించేవిధంగా పలు అభివృద్ధి పనులతో హార్సిలీహిల్స్ రూపురేఖలు మారనున్నాయని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌తో కలిసి మంగళవారం ఆయన హార్సిలీహిల్స్‌లో పర్యటించారు. పలమనేరు-కుప్పం-మదనపల్లె అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీకేఎం ఉడా) అధికారులు, రెవెన్యూ సిబ్బందితో హిల్స్‌లో తిరిగారు. స్కౌట్స్ అండ్ గైడ్స్, సీడీసీఎంఎస్, శానిటోరియం, రైల్వేస్ తదితర శాఖలకు హిల్స్‌పై కేటాయించిన స్థలం, వాటిలో చేపట్టిన నిర్మాణాలు, ఖాళీగా ఉన్న స్థలాలను పరిశీలించారు. ఏ సర్కిల్‌లో ఏయే పనులు చేపట్టవచ్చు, నిరాదరణకు గురైన నిర్మాణాలు, ప్రదేశాలను పర్యాటకులను ఆకట్టుకునేలా ఎలా తీర్చిదిద్దవచ్చు అనే విషయాలపై చర్చించారు. పర్యాటకులు ఎక్కువగా సంచరించే గాలిబండ, వ్యూపాయింట్లు, హరిత సర్కిల్ తదితర ప్రదేశాలతో పాటు హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీ కార్యాలయం వద్ద పారిశుధ్యలోపాలను స్వయంగా చూశారు. హార్సిలీహిల్స్ రూపురేఖలు మారనున్నాయని జేసీ, సబ్ కలెక్టర్‌లు తెలిపారు. జిల్లాలో ముఖ్యమైన పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ అభివృద్ధికి సీఎం చంద్రబాబు చొరవ చూపుతున్నారన్నారు. కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాల మేరకు హిల్స్‌లో పర్యటించి చేపట్టాల్సిన వివిధ పనులను గుర్తించామన్నారు. అభివృద్ధి పనులకు పీకేఎం ఉడా వైస్‌ఛైర్మన్‌గా కొంతమేర నిధులను తాను కేటాయిస్తానని, టౌన్‌షిప్ కమిటీ ఆధ్వర్యంలో కొంత, కలెక్టర్ నుంచి మరికొన్ని నిధులను సమకూర్చుకుని గుర్తించిన పనులను పూర్తి చేస్తామని జేసీ తెలిపారు. కాహార్సిలీహిల్స్‌లో రూ.200 కోట్ల అంచనాతో ఒబెరాయ్ సంస్థ నెలకొల్పనున్న ప్రాజెక్టుపై ప్రభుత్వానికి, ఒబెరాయ్ సంస్థకు మధ్య చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు.

పీకేఎం ఉడా ఆధ్వర్యంలో పనులు..

హార్సిలీహిల్స్‌లో పీకేయం ఉడా ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జేసీ ఆదేశించారు. ప్రతిపాదనల మేరకు అవసరమైన నిధుల లభ్యతను బట్టి దశల వారీగా పనులను చేపడతామన్నారు. కొండపై గవర్నర్ బంగ్లా, వ్యూపాయింట్, ఏనుగు మల్లమ్మగుడి, హరిత సర్కిల్, గాలిబండ తదితర ప్రదేశాలను కలుపుతూ 2 వేల మీటర్ల వాకింగ్‌ట్రాక్, సర్కిల్స్ నిర్మాణం, ముఖద్వారంలో ఆర్చి, గాలిబండ ఎంట్రెన్స్‌లో సుందరప్రహరీ, బండపై పర్యాటకులు సేద తీరే విధంగా రౌండ్‌టేబుల్ సీటింగ్, అరకు కాఫీ షాపు, డిజిటల్ బోర్డులు, లైటింగ్, శానిటరీ వర్కింగ్ తదితర పనులు చేట్టనున్నారు. పర్యాటకుల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు జేసీ తెలిపారు. కార్యక్రమంలో పీకేఎం ఉడా డీఈ శ్రీనివాస మహేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ లోకేష్, తహశీల్దార్ అజారుద్దీన్, ఆర్ఐ వీరాంజనేయులు, వీఆర్వో జయరాంరెడ్డి, పీఆర్ డీఈ సూర్యనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

మహా సందడి

● సెక్యూరిటీపై కడప, అనంతపురం ఎస్పీల పరిశీలన
● వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ రివ్యూ
● మహానాడు నిర్వహణ కమిటీల్లో.. జిల్లా నేతలకు పెద్దపీట



మహానాడు కోసం చురుగ్గా సాగుతున్న ఏర్పాట్లు

(కడప-ఆంధ్రజ్యోతి): టీడీపీలో మహాసందడి నెలకొంది. తొలిసారిగా కడపలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో మహానాడు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జల్లాలో ఇప్పటికే పులివెందుల, మైదుకూరు, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, రైల్వేకోడూరులో మినీ మహానాడు నిర్వహించారు. బుధవారం కడపలో మినీ మహానాడు జరగనుంది. ఇంకో పక్క బహిరంగసభకు జనసమీకరణ, మహానాడు ఏర్పాట్లపై తలమునకలై ఉన్నారు. మహానాడు వేదిక ఏర్పాట్లు త్వరితగతిన సాగుతున్నాయి. వర్షం అడ్డంకి కల్పిస్తున్నా చకచకా పనులు సాగుతున్నాయి. ఇప్పటికే మైదానంలో తొలి రెండురోజులు జరిగే ప్లీనరీ సమావేశానికి బహిరంగసభ వేదిక నిర్మాణ పనులు చురుగ్గా సాగు తున్నాయి. సీఎం చంద్రబాబు సహా వీఐపీలంతా విచ్చేస్తుండడంతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా మంగళవారం కడప ఎస్పీ అశోక్ కుమార్, అనంతపురం ఎస్పీ జగదీశ్ మహానాడు ప్రాంగణాన్ని పరిశీలించారు. భద్రతను పరిశీలించి అక్కడున్న ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి తదితరులతో చర్చించారు. వేదికకు సంబంధించిన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 23వ తేదీ లోపు మైదానం సిద్ధం చేసేందుకు రేయింబవళ్లు పనిచేస్తు న్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి మహానాడు ఏర్పాట్లను మంగళవారం రాత్రి పరిశీలించారు.



మహానాడు ప్రాంగణం వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కడప, అనంతపురం ఎస్పీలు అశోక్‌కుమార్, జగదీశ్ చిత్రంలో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు

19 నిర్వహణ కమిటీలు

మహానాడును విజయవంతం చేసేందుకు 19 కమిటీలను పార్టీ ప్రకటించింది. టీడీపీ రాష్ట్ర అధ్య క్షుడు పల్లాశ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బక్కరి నరసింహులు ఆధ్వర్యంలో ఆహ్వాన కమిటీ ఏర్పాటు చేయగా మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో జిల్లాకు పెద్దపీట వేశారు. వసతి ఏర్పాట్ల కమిటీలో పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు పుత్తా చైతన్యరెడ్డి, సుధాకర్ యాదవ్, ఆర్.మాధవి, వరదరాజులరెడ్డి, రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, పులివెందుల, జమ్మలమడుగు, బద్వేలు ఇన్‌చార్జిలు బీటెక్ రవి, భూపేశ్‌రెడ్డి, రితీశ్‌రెడ్డి ఉన్నారు. భోజన ఏర్పాట్ల కమిటీలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఖాదీ బోర్డు ఛైర్మన్ పీకే చౌదరి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు.. సాంస్కృతిక కార్యక్రమాల కమిటీలో పంతగాని నరసింహప్రసాద్.. ఫొటో ప్రదర్శన కమిటీలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు, కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్, సభా ప్రాంగణ పర్యవేక్షక కమిటీలో ఎమ్మెల్యేలు పుత్తా చైతన్యరెడ్డి, మాధవి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఉన్నారు. అలంకరణ కమిటీలో పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, బీటెక్ రవి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి.. రవాణా కమిటీలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, వాహన పార్కింగ్ కమిటీలో ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి, భూపేశ్‌రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి, ప్రొద్దుటూరు మాజీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. వలంటీరు నిర్వహణ కమిటీలో ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సూర్యప్రకాశ్, తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరాం చినబాబు.. సుందరీకరణ పరిశుభ్రత కమిటీలో ఎస్.గోవర్ధనరెడ్డిలను నియమించారు.

కలెక్టర్ సమీక్ష

మంగళవారం రాత్రి మహానాడు బహిరంగ సభాస్థలం వద్ద ఎస్పీ అశోక్‌కుమార్, జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడుతో కలిసి జిల్లా అధికారులతో కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 26 నుంచి 29 వరకు జిల్లాలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనకు పటిష్ఠమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులందరు ప్రోటోకాల్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, డీపీవో రాజ్యలక్ష్మి, డీఎంహెచ్‌వో నాగరాజు, పోలీసు ఫైర్‌ఆఫీసర్ ధర్మారావు, విద్యుత్తు, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



మహానాడు ఏర్పాట్లకు సంబంధించి అన్ని శాఖల అధికారులతో సమీక్షిస్తున్న కడప కలెక్టర్ శ్రీధర్

రెండు పవర్ ప్రాజెక్టులకు క్యాబినెట్ ఆమోదం

కడప ఎన్టీఆర్‌సర్కిల్, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ ప్రాంతాల్లో రెండు పవర్ ప్రాజెక్టులకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మంగళవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో పలు అంశాలపై చర్చించి ఆమోదించారు. ఈ మేరకు వివరాలను రాష్ట్ర మంత్రులు పార్థసారధి, నాదెండ్ల మనోహర్ సంయుక్తంగా మీడియాకు వెల్లడించారు. ఇంధన శాఖకు సంబంధించి జిల్లాలోని గంగాదేవపల్లె, నల్లబల్లి ప్రాంతాల్లో 260 మెగావాట్ విండ్ సోలార్ హైబ్రిడ్ పవర్ కెపాసిటీని అంప్లస్ ఎనర్జీ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్ గ్రూపు కంపెనీలకు బదిలీ చేయడానికి రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపిందన్నారు. కె.బొమ్మేపల్లి గ్రామంలో వెయ్యి మెగావాట్ పంప్డ్ స్టోరేజీ హైడ్రో పవర్ ప్రాజెక్టు స్థాపనకు జీవో ఎంఎస్ నెం.12 ప్రకారం ఎకరాకు రూ.5లక్షల చొప్పున 41.99 ఎకరాల ప్రభుత్వ భూమిని రూ.2,09,95,000లకు ఎంఎస్ ఆదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్‌కు బదిలీ చేయడానికి రాష్ట్ర రెవెన్యూశాఖ చేసిన ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపిందన్నారు.

మాకూ పదోన్నతులు ఇవ్వండి

● వైసీపీ హయాంలో అడ్డగోలుగా ప్రిన్సిపాల్స్ పదోన్నతి
● ఇంటిగ్రేటెడ్ సీనియారిటీని ఖాతరు చేయని వైనం
● ప్రమోటీ జూనియర్ లెక్చరర్లకు తీవ్ర అన్యాయం
● న్యాయం చేయాలని మంత్రి లోకేశ్‌కు ప్రమోటీల ఫిర్యాదు

వీలేరు రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో ఇంటిగ్రేటెడ్ సీనియారిటీ జాబితాలో ఉన్న ప్రమోటీ జూనియర్ లెక్చ ర్లను పక్కన పెట్టి జూనియర్స్ అయిన డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో వచ్చిన వారికి ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతి కల్పించారు. దీంతో ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న ప్రమోటీ జూనియర్ లెక్చర ర్లకు తీవ్ర అన్యాయం జరిగిందని పలువురు వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అన్యాయంపై తమకు న్యాయం చేయా లని కోరుతూ ప్రమోటీ జూనియర్ లెక్చరర్లు రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేశ్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. 1998, 1999, 2000, 2001లో కామన్ సీనియారిటీ ద్వారా స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. పదోన్నతి పొందిన జూని యర్ లెక్చరర్లకు రెగ్యులరైజేషన్ జరిగి ఇంటిగ్రేటెడ్ సీనియారిటీ ప్రకారం 2018 వరకు ప్రిన్సిపాల్స్‌గా, డిగ్రీ కళాశాల లెక్చరర్స్‌గా పదో న్నతి పొందారు. అడ్డగోలు సంస్కరణలకు మారుపేరైన జగన్ ఏలుబ డిలో 2024 ఎన్నికల కోడ్ వెలువడడానికి ముందురోజు అంటే మార్చి 15న ఇంటిగ్రేటెడ్ సీనియారిటీ లిస్ట్‌లో ఉన్న ప్రమోటీ జూనియర్ లెక్చ రర్స్‌ను పక్కన పెట్టి జూనియర్స్ అయిన డైరెక్ట్ రిక్రూట్స్ మాత్రమే 197 మందికి ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతి కల్పించారు. దీంతో సీనియర్స్‌కు తీవ్ర అన్యాయం జరిగింది.


తమకు జరిగిన అన్యాయంపై న్యాయం చేయాలని విద్యా శాఖా మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఇదేమీ పట్టించుకోని ఇంటర్ బోర్డు అధికారులు జగన్ జమానాలో ఇచ్చినట్లే మరో 110 మందికి ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతి ఇచ్చారు. అటు జగన్ ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ డైరెక్ట్ రిక్రూట్స్‌కు మాత్రమే న్యాయం చేయడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమోటీ జూనియర్ లెక్చరర్స్‌కు ప్రిన్సిపాల్ ప్రమోషన్‌కు సంబంధించిన జీవో 302 ఇప్పటికీ అమలులో ఉండగా అసంబద్ధ రిపోర్ట్ ఆధారంగా ఒకే వర్గానికి లబ్ధి చేకూరేలా వ్యవహరించడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం (ఫైల్)

ఒకే క్యాడర్‌లో 25 సంవత్సరాలకు పైగా సేవలు అందిస్తూ ప్రమోషన్స్‌కు అన్ని అర్హతలున్నా పక్కన పెట్టడం చాలా అన్యాయ మని వాపోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 210 మంది ప్రమోటీలు జూని యర్ లెక్చరర్లుగా పనిచేస్తున్నారు. వీరిలో చాలా మంది 2030 నాటికి పదవీ విరమణ పొందుతారు. ఇప్పటికైనా ప్రభుత్వం సీనియర్స్ అయిన ప్రమోటీ జూనియర్ లెక్చరర్లకు న్యాయం చేయాలని కోరుతు న్నారు.హైస్కూల్ ప్లస్, వాటి స్థానంలో ఏర్పడే జూనియర్ కళాశాల లకు ప్రిన్సిపాల్స్‌గా నియమించాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యా శాఖా మంత్రి వాస్తవాలను గుర్తించి ప్రమోటీ జూనియర్ లెక్చరర్లకు న్యాయం చేయాలని కోరుతున్నారు.


మంత్రి నారా లోకేశ్ చొరవ చూపాలి...



ప్రిన్సిపాల్స్ ప్రమోషన్లలో మాకు జరిగిన అన్యాయంపై రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవ చూపాలి. 2018 వరకు కొనసాగిన ఇంటిగ్రేటెడ్ సీనియారిటీ విధానాన్ని అమలు చేయాలి. గత ప్రభుత్వంలో మాకు అన్యాయం చేశారు. పలుమార్లు ఇంటర్ బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదు. ఇంకెంత కాలం వేచి చూడాలి.

- డి.మురళీధర్, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ సంఘం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.

ప్రమోషన్ లేకుండా పదవీ విరమణ బాధాకరం



ప్రమోషన్ లేకుండా పదవీ విరమణ చేయడం బాధాకరం. ఒకే క్యాడర్‌లో ఉంటూ జూనియర్స్ ప్రిన్సిపాల్స్ కావడం, సీనియర్లు అలాగే కొనసాగడం బాధాకరం. మంత్రితో పాటు ఇంటర్ బోర్డు అధికారులు వాస్తవాలను గుర్తించి న్యాయం చేయాలి. 25 నుంచి 30 సంవత్సరాలు పదోన్నతి లేకుండా ఒకే క్యాడర్‌లో కొనసాగి పదవీ విరమణ పొందడం శోచనీయం.

- నాగసురేష్, జూనియర్ లెక్చరర్స్ సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్.

ఐదుగురు పీఆర్ రిటైర్డు ఇంజనీర్లకు భారీ జరిమానా

● నిధుల రికవరీతో పాటు పెన్షన్‌లలో కోత
● కమలాపురం మండలంలో జరిగిన పనుల్లో అక్రమాల ఫలితం

కలికిరి, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేసిన ఐదుగురు పంచాయతీరాజ్ శాఖ ఇం జనీర్లకు ప్రభుత్వం భారీగా జరి మానా విధించింది. కమలాపురం మండలంలో జరిగిన పనుల్లో వెలికితీసిన అక్రమాల్లో ఒక సూపరింటెండింగ్ ఇంజనీరు కూడా భాగస్వామి కావడం విశేషం. ఉమ్మడి ఏపీలో 2010లో జరిగిన వివిధ పనుల్లో జరిగిన అవినీతి కారణంగా 15 ఏళ్ల తరువాత విచారణలు ఒక కొలిక్కి రాగా తాజాగా మంగళ వారం దీనికి సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. కాగా ఈ ఐదుగురు ఇంజనీర్లు ప్రస్తుతం రిటైరు అయ్యారు. వివరాలిలా ఉన్నాయి. కమలాపురం మండల పరి షత్తు నిధుల నుంచి వివిధ గ్రామాల్లో సిమెంటు రోడ్లు, స్ప్రింగ్ చానెళ్ళు, వంకలకు రక్షణ గోడలులాంటి పనులు జరిగాయి. అయితే బిల్లుల చెల్లింపులో అనేక అక్రమాలు జరిగినట్లు 2012లో విజిలెన్స్ తనిఖీల్లో వెలుగు చూసింది. ఈ అక్రమాలపై పలు రకాల విచారణలు జరిగాయి. పలువురు విచారణాధికారు లను నియమించి నిధుల దుర్వినియోగం గురించి నిగ్గు తేల్చారు. చివరికి ఐదుగురు ఇంజనీర్లను బాధ్యులుగా నిర్ధారిం చారు. వీరి నుంచి పలు దఫాలు వివరణలు కూడా తీసుకు న్నారు. వీరంతా ప్రస్తుతం రిటైరయ్యారు. ఇందులో అప్పట్లో కడప సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీరుగా పనిచేసిన కె.వి. గోవిం దరావు పెన్షన్‌లో 2 శాతం కోత విధించారు. ఈ పనులు పర్యవేక్షించిన అప్పటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు జి.సురేంద్రనాథ్ పెన్షన్‌లో 5 శాతం కోత విధించారు. అంతేగాకుండా దు ర్విని యోగమైన నిధుల్లో రూ.2,56,748 ఆయ న నుంచి రికవరీకి ఆదేశించారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పనిచేసిన డి.దేవదాస్ పెన్షన్‌లో 15 శాతం కోత విధించారు. దుర్వినియో గమైన నిధుల్లో రూ.20,18,390 రికవరీకి ఆదేశించారు. అసిస్టెం ట్ ఇంజనీరుగా పనిచేసిన జి.రామమోహన్‌రెడ్డి పెన్షన్‌లో 3 శాతం కోత విధించడంతో పాటు రూ.45,380లు రికవరీ చేయ నున్నారు. మరో ఏఈ వి.వి.సుబ్బారెడ్డి పెన్షన్‌లో 15 శాతం కోత విధించడంతో పాటు రూ.13,73,074 రికవరీకి ఆదేశించారు. అందరి నుంచి కలిపి రూ.36,93,592 రికవరీ చేయనున్నారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్‌కుమార్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

కోదండరాముడిని దర్శించుకున్న జడ్జిలు



పూర్ణకుంభంతో జడ్జిలకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

ఒంటిమిట్ట, మే 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండ రామాల యాన్ని మంగళవారం ఉదయం సత్తెనపల్లె సీనియర్ సివిల్‌జడ్జి విజయ్‌కుమార్‌రెడ్డి, విజయనగరం జిల్లా లీగల్‌సెల్ అథారిటీ జడ్జి కృష్ణప్రసాద్, కైకలూరు సివిల్‌జడ్జి కిరణ్‌కుమార్‌లు సంద ర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వీర రాఘవాచా ర్యులు వారికి స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. ఈ సందర్భంగా వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ చరిత్ర గురించి అర్చకులు వీణా రాఘవాచార్యులు వివరించారు. ఆల యంలో శిల్ప సంపద అద్భుతంగా ఉందని జడ్జిలు కొనియా డారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం జూనియర్ సివిల్‌జడ్జి, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

● 125 గ్రాముల బంగారం, అర కేజీ వెండి, రూ.50 వేలు అపహరణ

మదనపల్లె అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి నగలు , నగదు అపహరించుకు వెళ్లారు. మదన పల్లె మండలం చిప్పిలి గ్రామంలోని సురభి కాలనీలో నాగపరి మళ, శంకర్ రెడ్డి దంపతులు నివసిస్తున్నారు. సోమవారం ఉదయం ఆమె డ్యూటీకి వెళ్లగా, మధ్యాహ్నం భర్త ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే సరికి తలుపులు తెరిచి ఉండడం కనిపించింది. దీంతో లోపలికి వెళ్లి పరిశీలించగా బీరువాలోని 125 గ్రాములు బంగారు, అర కేజీ వెండి వస్తువులు, రూ.50 వేలు నగదు చోరీకి గురైనట్లు తె లిసింది. తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ కళా వెంకటరమణకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవదాయ భూములను పరిరక్షించాలి

● కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దేవాదాయ శాఖ భూములను పరిరక్షించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబం ధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో దేవదాయ భూముల పరిరక్షణపై జిల్లా స్థాయి భూసంరక్షణ కమిటీ సభ్యులతో కలెక్టర్ అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 9761 ఎకరాల దేవాలయ భూములు ఉన్నాయన్నారు. ఈ భూములన్నింటినీ కూడా తప్పనిసరిగా సంరక్షించాలన్నారు. ఎక్క డైనా ఆక్రమణకు గురై ఉంటే వెంటనే గుర్తించి వాటిని తొలగించాలని ఆదేశించారు. జిల్లాలో ఆక్రమణలో గుర్తించిన 1167.52 ఎకరాల భూముల్లో ఉన్న ఆక్రమణలను తొలగించాలని, ఇందుకు సంబంధించి ఏదేని కోర్టుల్లో కేసులు ఉన్న వాటికి వెంటే స్టే వెకేషన్ కొరకు కౌంటర్ దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తంగా ఉన్న 9761 ఎకరాలకు గానూ గత సెప్టెంబరు నెలలో నిర్వహించిన సమావేశం నాటికి 4866 ఎకరాల భూములు వన్‌బీ, అడంగల్‌లో దేవ దాయ పేర్లు నమోదయ్యాయని, ప్రస్తుతం 5500 ఎకరాలకు సంబం ధించిన వన్‌బీలో పేర్లు నమోదు కావడం జరిగిందన్నారు. ఇంకా దాదాపు 2200 పైబడిన భూములకు వెంటనే వన్‌బీ, అడంగల్‌లో సంబంధిత దేవాలయ పేర్లు నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవా లని రెవెన్యూశాఖ అధికారులను ఆదేశించారు. దేవదాయశాఖ అధికారి విశ్వనాథ్ మాట్లాడుతూ జిల్లాలో ఆలయాలకు చెందిన 5700 ఎకరాల భూములు ఖాళీగా ఉన్నాయని, వాటిని గుర్తించాల్సి ఉందన్నారు. భూములను గుర్తించి లీజుకు ఇవ్వడం ద్వారా దేవాలయాల ఆర్థిక స్థితి మెరుగు పరుడుతుందని కలెక్టర్‌కు వివరించారు. అనంతరం వివిధ అంశాల్లో చర్చించి పలు సూచనలు జారీ చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఈవోలు, తనిఖీదారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

యోగాంధ్ర కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలి

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు జిల్లాలో యోగాంధ్ర-2025 కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ శారీరక, మానసిక ప్రశాంతతతో పాటు ఒత్తిడిని తగ్గించేందుకు యోగా ఉన్న ఉత్తమమైన సాధనమన్నారు. జూన్ 21న విశాఖపట్నం రామకృష్ణ బీచ్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమ క్షంలో జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జిల్లాలో కూడా యోగాంధ్రపై ప్రజల్లో విస్తృత అవ గాహన కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈనెల 21న జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, యోగా శిక్షకులు, యోగా అభ్యాసకులు, పీఈటీలు తదితరులతో ఒక కర్టెన్ రైజర్ నిర్వ హించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాల పెంపుపై శిక్షణ

సంబేపల్లె, మే 20 (ఆంధ్రజ్యోతి): నాయకత్వ లక్షణాల పెంపుపై సిమాట్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు శిక్షణ తరగతులను ఏర్పాటు చేసినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తెలిపారు. విజయ వాడలో ఈ నెల 19వ తేదీ నుంచి మే 23వ తేదీ వరకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణా తరగతులకు అన్నమయ్య జిల్లా నుంచి పది మంది ప్రిన్సిపాళ్లు ఎంపికయ్యారని, వారు తరగతులకు హాజరవుతు న్నట్లు తెలిపారు. తరగతులకు హాజరైన ప్రిన్సిపాళ్లు వారి ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు లీడర్షిప్‌పై శిక్షణ ఇవ్వ నున్నట్లు తెలిపారు.



శిక్షణకు హాజరైన జిల్లాలోని వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు

నీటి సంఘం ఎన్నికకు గ్రహణం

● వర్గపోరు కారణంగా వాయిదా
● అభివృద్ధికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపించని వైనం
● ఆవేదన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

సుండుపల్లె, మే 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నీటి సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు పచ్చజెండా ఊపింది. రాష్ట్ర వ్యాప్తంగా గత ఏడాది డిసెంబరు 14వ తేదీ నీటి సంఘం ఎన్నికలు జరగ్గా పింఛా ప్రాజెక్టు ఎన్నికలు మాత్రం 17వ తేదీ జరుపుతుండగా టీడీపీలో వర్గ పోరు కారణంగా ఎన్నిక అర్ధంతరంగా ఆగిపోయింది. రాజంపేట నియోజకవర్గంలోని కీలక నేతలు తమ వర్గంలోని వారినే పింఛా నీటి సంఘం చైర్మన్‌గా ఎన్నిక చేయాలని పట్టుబట్టడంతో టీడీ పీలోని నాయకుల మధ్య పరస్పరం దూషణలు, కొట్టుకునే స్థాయికి చేరింది. ఈ పరిస్థితుల్లో రాజంపేట సబ్ కలెక్టర్ నిదియాదేవి నీటి సంఘం ఎన్నిక ప్రక్రియ జరుగుతున్న ప్రదేశానికి చేరుకుని ఎన్నిక లను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తరువాత ఎన్నిక నిర్వహ ణకు నోటిఫికేషన్ జారీ కాలేదు. ఎన్నిక జరగకపోవడం ప్రాజెక్టుకు దిగువ భాగంలో ఉండే రైతాంగానికి శాపంగా మారిందని చెప్పుకో వచ్చు. వేసవిలో కూడా ప్రాజెక్టులో పుష్కలంగా నీరు నీరు ఉన్నా కుడి, ఎడమ కాలువల మరమ్మతులు చేయకపోవడం వలన చివరి ఆయకట్టు రైతుకు నీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నోటిఫికేషన్ వస్తే నిర్వహిస్తాం

ప్రాజెక్టు నీటి సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ వస్తే ఎన్నికలు నిర్వహిస్తాము. పింఛా ప్రాజెక్టు అభివృద్ధికి నిధులు అవసరం ఉంది. నీటి సంఘం ఎన్నికలు జరిగిన కుంటలు, చెరువు ల అభివృద్ధికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాము. పింఛా ప్రాజెక్టు అభివృద్ధి నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపిస్తాము.

- నాగేంద్రనాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, పింఛా ప్రాజెక్టు

నిధులు వచ్చేదెలా..?

సుండుపల్లె మండల వ్యాప్తంగా రెండు కుంటలు, రెండు చెరువులు ఒక ప్రాజెక్టుకు ఎన్నికలు జరగాల్సి ఉండగా రెండు కుంటలు, రెండు చెరువులకు నీటి సంఘం ఎన్నికలు జరిగాయి. అయితే ఆ రెండు కుంటలు, రెండు చెరువుల కంటే ఎర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి పింఛా ప్రాజెక్టు అధికారికంగా సుమారు 3773 ఎకరాల సాగు భూమికి, అన ధికారికంగా మరో 1500 ఎకరాల సాగుభూమికి సాగునీటిని అంది స్తోంది. ఏప్రిల్, మే నెలలోనూ ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాలువల ద్వారా రైతాంగానికి నీరు అందిస్తున్న ఏకైక ప్రాజెక్టు పింఛా ప్రాజెక్టు. అయితే కాలువల్లో కొన్ని చోట్ల మరమ్మతులు చేయకపోవడంతో చివరి ఆయకట్టు వరకు నీరందడం లేదు. నీటి సంఘం ఎన్నికలు జరిగి ఉంటే ప్రభుత్వానికి అభివృద్ధి నిధుల కోసం ప్రతిపాదనలు పంపించి ఉండేవారు. ఎన్నికలు జరి గిన కుంటలు, చెరువులకు అభివృద్ధి కోసం నిధులు కావాలని ప్రతిపాదనలు పంపించారు. కానీ రైతు లకు అండగా ఉండి సాగునీటిని అందిస్తున్న పింఛా ప్రాజెక్టుకు మాత్రం ప్రతిపాదనలు పంపించలేదు. ఇందుకు ప్రధాన కారణంగా నీటి సంఘం ఎన్ని కలు జరగకపోవడమే కారణమని స్పష్టంగా తెలు స్తోంది. త్వరగా నీటి సంఘం ఎన్నికలు నిర్వహిం చేలా పై అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి నీటి సంఘం ఎన్నిక ప్రక్రియ పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.



పింఛా ప్రాజెక్టు

టీచర్ల ప్రిఫరెన్షియల్ బదిలీల కోసం
నేడు ప్రత్యేక వైద్య శిబిరం

కలికిరి, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన స్టేట్ టీచర్స్ ట్రాన్స్‌ఫర్స్ రెగ్యులేషన్ యాక్టు మేరకు త్వరలో జరగనున్న బది లీల కోసం వైద్య కారణాలతో ప్రాధాన్యత (ప్రిఫరెన్షియల్) పొందగోరే ఉపాధ్యాయులు తప్పనిసరిగా తాజా వైద్య ధృవపత్రాలు సమర్పించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా లోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల కోసం బుధవారం తిరుపతి రుయా వైద్యశాలలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తిరుపతి జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి (డీఎస్‌ఈవో) కె.వి.ఎన్.కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత ఉపాధ్యాయులు ఉదయం 9 గంట లకు హాజరు కావాలన్నారు. వైద్య కారణాలతో బదిలీల్లో ప్రాధాన్యత పొందాలనుకునే ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఈ వైద్యశిబిరంలో సంబంధిత వైద్యుల వద్ద పరీక్షలు చేయించుకుని ఆ మేరకు పొందిన వైద్య ధ్రువపత్రాలను బదిలీల్లో ఉపయోగించుకోవాలని సూచించారు. బదిలీల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీ వర్తింపజేయడానికి ఈ ప్రత్యేక వైద్య శిబిరం ద్వారా జారీ అయిన ధ్రువపత్రాలను మాత్రమే పరిగణలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు.

మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లిన దొంగలు

రాజంపేట టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణంలోని ఉప్ప రపల్లెలో మంగళవారం ఉదయం సరస్వతి అనే మహిళ మెడలోని గొలు సును దొంగలు లాక్కెళ్లినట్లు బాధితురాలు మన్నూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఉప్పరపల్లెలో ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు అడ్రస్సు అడుగుతూ వచ్చారు. అందుకు సరస్వతి అనే మహిళ సమా ధానం ఇస్తున్న సమయంలో మెడలో సుమారు రూ.2 లక్షల విలువ చేసే 25 గ్రాముల తాళిబొట్టు సరుడును లాక్కెళ్లారు. ఆమె ఫిర్యాదు మేరకు మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఫారంపాండ్ పనులను పరిశీలించిన పీడీ



పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

గాలివీడు, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూలివీడు గ్రామం చీమ లచెరువుపల్లిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన ఫారం పాండు పనులను మంగళవారం ఉపాధి పీడీ వెంకటరత్నం పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతి ష్టాత్మకంగా ఫారంపాండు పనులు చేపట్టిందని ఈ పనులు వలన రైతు లకు నీటి నిల్వలు ఉండి అవసరమైన సమయంలో నీటి ఎద్దడి లేకుండా ఉపయోగపడుతుందని తెలిపారు. భూమిలోని నీటి నిల్వలు పెరిగి భూసారం పెరుగుతుందని రైతులకు వివరించారు. పనులకు హాజరైన వేతనదారులు, వారికి ఇచ్చిన కొలతల ప్రకారం పని చేసుకుని రోజుకి సగటు 300 రూపాయలు పొందే విధంగా పనులు చేయాలని వేతనదా రులకు, సిబ్బందికి సూచించారు. అంతేగాక ఉపాధి హామీ పథకం అమల్లో పూర్తిగా పారదర్శకత పాటించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అత్యధిక పనిదినాలు కల్పించి ఆర్థిక భరోసా కల్పించాలని ఏపీవోలకు సూచించారు. ఆయన వెంట ఏపీవోలు హరిబాబు, రామచంద్ర, టీఏఎఫ్ ఏలు తదితరులు పాల్గొన్నారు.

దేవరరాయి హుండీ ఆదాయం లెక్కింపు

సంబేపల్లె, మే 20 (ఆంధ్రజ్యోతి): దేవరరాయి నల్లగంగమ్మ తల్లి హుండీ ఆదాయం రూ.3,23,797 వచ్చినట్లు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య తెలిపారు. ఆలయ సిబ్బంది పోలీసుల పర్యవేక్షణలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు తెలిపారు. హుండీ ద్వారా వచ్చిన ఆదాయం మొత్తాన్ని బ్యాంకులో జమ చేస్తున్నట్లు తెలిపారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

నందలూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామా నికి చెందిన గొల్ల శ్రావణి (19), విఘ్నేశ్వరన్ (21) ప్రేమ పెళ్లి చేసుకుని స్థానిక పోలీసులను ఆశ్రయించిన సంఘటన మంగళవారం చోటు చేసు కుంది. ఇద్దరూ మేజర్లు కావడం, పరస్పరం ఇష్టపడటంతో వివాహం చేసుకున్నాని పోలీసులకు తెలిపారు. దీంతో ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి ఇరు వురు కుటుంబాలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపినట్లు తెలిపారు.

నా భర్త ఆచూకీ తెలపండి సారూ...



మాట్లాడుతున్న రాజేశ్వరి

రాజంపేట టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ పోషణ కోసం కువైత్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న తన భర్త ఆచూకీ తెలియడం లేదని ఆయన భార్య రాజ్యబోయిన రాజేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే... పెనగలూరు మండలం చక్రంపేట గ్రామానికి చెందిన మనోహర్ కుటుంబ సభ్యులు రాజంపేట రామ్‌నగర్‌లో నివాసం ఉంటు న్నారు. జీవనోపాధి కోసం కువైత్‌కు వెళ్లిన మనోహర్ తన కుటుంబ సభ్యులను చూసేందుకు ఈనెల 17న శ్రీలంక ఎయిర్‌లెన్స్ విమానంలో ఇంటికి బయలు దేరాడు. ఇండియాకు వస్తున్నట్లు భార్య రాజేశ్వరికి ఫోన్ ద్వారా తెలిపారు. తన భర్త మూడు రోజులైనా ఇంటికి చేరుకోకపోవ డంతో మీడియాను సంప్రదించారు. తన భర్తకు ఫోన్ కూడా కలవడం లేదని, ఆందోళనగా ఉందన్నారు. తన భర్త ఆచూకీ తెలపాలని ముఖ్య మంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లను మీడియా ద్వారా వేడుకు న్నారు.

ఘనంగా ఏనుగు మల్లమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

బి.కొత్తకోట, మే 20 (ఆంధ్రజ్యోతి): హార్సిలీహిల్స్‌లో ఏనుగుమల్లమ్మ జా తర సందర్భంగా మంగళవారం ఉదయం అమ్మవారిని దివ్యంగా అలంకరించారు. పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటావూరు, బయప్పగారిపల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులు జ్యోతులు సమ ర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రోజంతా భజనలు, కోలాటలు, మేళ తాళాలతో గ్రామోత్సవం నిర్వహిం చారు. తీర్థప్రసాద వినియోగం, అన్నసంతర్పణ ఏర్పాట్లు చేశారు. అనం తరం రంగురంగుల పుష్పాలు, విద్యుత్‌దీపాలతో సుందరంగా అలంకరిం చిన హంసవాహనంపై అమ్మవారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి కొండపై ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త మదన్‌మోహన్‌రెడ్డి, రాజారెడ్డి, విజయారెడ్డిల ఆధ్వ ర్యంలో జాతర వైభవంగా జరిగింది.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



పీలేరు, మే 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై చిత్తు కాగితాలు ఏరుకునే ఓ గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు పీలేరు ఎస్‌ఐ లోకేశ్ తెలిపారు. పీలే రు-మదనపల్లె మార్గంలోని బ్రిడ్జి వద్ద సోమవారం మధ్యాహ్నం స్పృహ తప్పి పడిపోయిన అతనిని కొంతమంది పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం కన్నుమూశాడని ఎస్‌ఐ తెలిపారు. మరణించిన వ్యక్తి వయస్సు 40-45 ఏళ్ల మధ్య ఉంటుం దని, అతని గురించి తెలిసిన వారు 9440796744, 9440796745 నెంబ ర్లకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బీజేపీ వర్గీయులపై కత్తులతో వైసీపీ వర్గీయుల దాడి




గ్రామంలో విచారిస్తున్న ఎస్ఐ, తలకు గాయాలతో శ్రీనివాసులరెడ్డి

ముద్దనూరు మే 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి చిన్నదుద్యాల గ్రామంలో మంగళవారం ఉదయం బీజేపీ వర్గీయులపై వైసీపీ వర్గీయులు కత్తులతో దాడి చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. సీఐ సమాచారం మేరకు వివరాలు... చిన్నదుద్యాల గ్రామానికి సంబంధించిన మంచినీటి బోరు మోటారు మరమ్మతుకు గురికావడంతో గ్రామంలో మంచినీటి సమస్య ఏర్పడింది. దీంతో గ్రామంలోని బీజేపీ నాయకులు వెంకటేశ్వర్లరెడ్డి, మరికొందరు గ్రామస్థులు గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై గ్రామ సర్పంచ్ వరప్రసన్న భర్త మదన్‌మోహన్‌రెడ్డికి పంచాయతీ కార్యదర్శి సమాచారం అందించారు. అయితే వారు పట్టించుకోక పోవడంతో బీజేపీ నాయకులు వెంకటేశ్వర్లరెడ్డికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనుమతి తీసుకొని బోరు మరమ్మతు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఈ మేరకు వెంకటేశ్వర్లరెడ్డి ఉదయం బోరు బండిని పిలిపించి మరమ్మతులు చేయిస్తుండగా.. వైసీపీ సర్పంచి భర్త మదన్‌మోహన్‌రెడ్డి అక్కడకు మరో బోరు బండిని తీసుకువచ్చి సర్పంచ్ మేమని.. నీవు బోరు మరమ్మత్తులు చేస్తావంటూ బెదిరించాడు. అధికారుల అనుమతితో పనులు చేస్తున్నామని వెంకటేశ్వర్లరెడ్డి చెప్పడంతో ఇరువురు మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసింది. కొద్ది సేపటి తరువాత రెండు బైకుల్లో మదన్‌మోహన్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, ప్రసాదరెడ్డిలు కొడవళ్ల తీసుకు వచ్చి వెంకటేశ్వర్లరెడ్డిపై దాడికి పాల్పడగా స్వల్ప గాయంతో తప్పించుకున్నాడు. ఆ వెంటనే మరోసారి దాడి చేయగా వెంకటేశ్వర్లరెడ్డి తమ్ముడు శ్రీనివాసులరెడ్డి అడ్డుకోవడంతో అతని చేతులకు, తలకు గాయాలయ్యాయి. సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి పోలీసులు చేరుకోగా ముగ్గురు నిందితులు పరారయ్యారు. వెంకటేశ్వర్లరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, గాయపడిన శ్రీనివాసులరెడ్డిని చికిత్స నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ, ఎస్ఐలు తెలిపారు.

51 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



బియ్యం లోడుతో పట్టుబడిన వాహనం

దువ్వూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రబల్లి సమీపంలో మంగళవారం అక్రమం గా తరలిస్తున్న 51 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ వినోద్‌కుమార్ వివరాల మేరకు.. ఎం.సురేంద్ర అనే వ్యక్తి ఎర్రబల్లె ప్రాంతం నుంచి 51 బస్తాల రేషన్ బియ్యాన్ని సేకరించి బొలేరో వాహనంలో ఆళ్లగడ్డకు తరలిస్తుండగా.. ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేశామని తెలిపారు. వాహనంతో పాటు తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశామన్నారు. 2,400 కిలోల బరువుగల 51 ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు. దాడిలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏడుగురు జూదరులు అరెస్ట్

సింహాద్రిపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రహారం గ్రామంలో మంగళవారం ఏడుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రవి కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 5159 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే బలపనూరు గ్రామంలో ఓ వ్యక్తి తన ఇంటి వద్ద మద్యం బాటిళ్లు అమ్ముతుండగా అతన్ని అదుపులోనికి తీసుకుని 10 బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైభవంగా పుష్పయాగం

జమ్మలమడుగు, మే 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారికి అంగరంగ వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల చివరి రోజైన మంగళవారం ఉదయం 11 గంటలకు ఆలయంలో పండితులు హోమం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు హాజరై శ్రీవారినిదర్శించుకున్నారు. అనంతరం అన్నమాచార్య కీర్తనలు జరిగాయి. సాయంత్రం 7 గంటలకు నారాపురం వేంకటేశ్వరస్వామికి పుష్పయాగం నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళా భక్తులు పాల్గొన్నారు. పుష్పయాగానికి వివిధ రకాల పూలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, పండితులు, భక్తులు పాల్గొన్నారు.




శ్రీదేవి, భూదేవి సమేత నారాపురం వేంకటేశ్వరస్వామికి పుష్పయాగం నిర్వహిస్తున్న వేద పండితులు, పాల్గొన్న భక్తులు

అధైర్యపడద్దు... అండగా ప్రభుత్వం : బీటెక్ రవి

వేముల, మే 20 (ఆంధ్రజ్యోతి): యురేనియం పరివాహక గ్రామాల ప్రజలు ఎవరూ అధైర్యపడద్దు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. మంగళవారం యురేనియం టైలింగ్‌పాండ్‌ను ఆయన పరిశీలించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద నష్టపరిహారం, పునరావాసం కల్పించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా మన్నారు. టైలింగ్ పాండ్ ఎత్తును వెంటనే పెంచకపోతే వర్షపు నీరు ఎక్కువై ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతారన్నారు. వెంటనే టైలింగ్ పాండ్‌ను పునర్నిర్మించకపోతే యురేనియం కర్మా గారం మూతపడు తుందన్నారు. ఇక్కడి సమస్యలను సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పేర్ల పార్థసారధిరెడ్డి, పేర్ల శేషారెడ్డి, ట్రేడ్ యూనియన్ నాయకుడు శ్రీనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యురేనియం టైలింగ్ పాండ్‌ను పరిశీలిస్తున్న బీటెక్ రవి

కార్మికవర్గాన్ని బానిసలుగా మారుస్తున్న మోదీ ప్రభుత్వం

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

కడప సెవెన్ రోడ్స్, మే 20 (ఆంధ్రజ్యోతి): కార్మికవర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి విమర్శించారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరుతూ మంగళవారం కడప సబ్ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట కార్మిక సంఘాలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగసుబ్బారెడ్డి మాటాడుతూ బ్రిటీష్ వారితో కార్మికవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్‌కోడ్‌లు తెచ్చిందన్నారు. ఈ లేబర్ కోడ్‌ల వల్ల కార్పొరేట్‌ల లాభాలు పెరిగి, కార్మికులు హక్కులు లేని బాని సలుగా మారిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను సమ్మెల ద్వారా కట్టడి చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో ఏఐటీయూసీ, ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, అంగన్వాడీ యూనియన్, మున్సిపల్ యూనియన్, మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు జి.వేణుగోపాల్, బి.దస్తగిరిరెడ్డి, వి.అన్వేష్, చంద్రా రెడ్డి, వెంకటసుబ్బయ్య, బి.లక్ష్మీదేవి, రామకృష్ణారెడ్డి, రామ్మోహన్, కేశవ, గోపి, కె.సి.బాదుల్లా, మద్దిలేటి, సుబ్బరాయుడు, సుంకర రవి తదితరులు పాల్గొన్నారు.



కడప కలెక్టరేట్ ఎదుట కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న దృశ్యం

ఘనంగా హనుమజ్జయంత్యుత్సవాలు



గండి క్షేత్రంలో ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహానికి పూజలు చేస్తున్న దృశ్యం

చక్రాయపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో హనుమజ్జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం అంజన్నకు లఘు పూర్ణాహుతి గావించారు. ఉదయం వేదపారాయణం, యాగశాల ప్రవేశం, ద్వారాతోరణం, ఆరాధన, అగ్నిప్రతిష్ఠ హోమం, మూలమంత్ర ఆవాహనం, సోమకుంభ ఆవాహనం, తిరుమంజనం, లఘుపూర్ణాహుతి, గోష్ఠి, అనంతరం తీర్థప్రసాదాలు వినియోగించారు. సాయంత్రం త్రికార ఆరాధన, సుందరకాండ పారాయణం, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. యజ్ఞాచార్యులు ధర్మగిరి వేద పాఠశాల అధ్యాపకులు రామానుజాచార్యులు శిష్యబృందంచే స్వామివారి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజాస్వామి, ముఖ్య అర్చకులు రాగోపాలచార్యులు, వేదపారాయణ పండితులు రామ్మోహన్‌శర్మ, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగం రాలేదనే.. మనస్థాపంతో యువతి ఆత్మహత్య

పులివెందుల, మే 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాల్‌రెడ్డి ఫంక్షన్ హాల్ వెనుకవైపునున్న ఓ వీధిలో స్వాతి (23) అనే యువతి మంగళవారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే.... స్వాతి బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తోంది. ఈ ప్రయత్నాల్లో తనకు కావాల్సిన టెక్నికల్‌లో కాకుండా నాన్ టెక్నికల్‌లో ఉద్యోగం వచ్చింది. దీంతో మనస్థాపంతో చెందిన స్వాతి బెడ్‌రూమ్‌లోకి వెళ్లి తలుపువేసుకుంది. ఎంత సేపటికి కూతురు బయటకు రాకపోవడంతో ఆమె తండ్రి వరప్రసాద్, తల్లి కళావతిలు ఇంటిలోకి వెళ్లి పరిశీలించగా ఉరివేసుకొని కనిపించింది. దీంతో వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. చుట్టుపక్కల వారు స్వాతి మృతదేహాన్ని కిందికి దించారు. ఈ విషయం తెలిసిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చాంద్‌బాష తెలిపారు.

నోటీసులు ఇవ్వకుండానే స్కూలును కూల్చారు

- న్యూమోడల్ ఇంగ్లీషు మీడియం హైస్కూలు నిర్వాహకురాలు షర్మిల



న్యూమోడల్ ఇంగ్లీషు మీడియం హైస్కూలును కూల్చివేసిన దృశ్యం



మీడియాతో మాట్లాడుతున్న స్కూలు నిర్వాహకురాలు

కడప క్రైం, మే 20 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని సీఎస్ కాంపౌండులో 35 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న న్యూమోడల్ ఇంగ్లీషు మీడియం హైస్కూలును తమకు ఎలాంటి నోటీసులు, సమాచారం ఇవ్వకుండానే కూల్చివేశారని ఆ స్కూలు నిర్వాహకురాలు షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్కూలు వద్ద ఆమె మీడియాతో మాట్లాడారు. 1969వ సంవత్సరంలో మైనార్టీ ఎడ్యుకేషనల్ సొసైటీ కింద న్యూమోడల్ స్కూలును ఇక్కడ నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం 250 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారన్నారు. అయితే తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే అర్ధ రాత్రి స్కూలు భవనం కూల్చివేశారని.. దీంతో స్కూలులో ఉన్న ఫర్నీచర్ పూర్తిగా ధ్వంసమైందన్నారు. ప్రస్తుతం పదో తరగతి ఫలితాలు వచ్చాయని.. కొంత మంది సప్లిమెంటరీ పరీక్షలు కూడా రాస్తున్నారన్నారు. అయితే వారికి మార్కులిస్టులు, స్టడీ సర్టిఫికెట్లు ఇవ్వాలని తమను బిషప్ పిలిపించి అడిగాడని, అయితే స్కూలు విద్యార్థులు ఇబ్బందికి గురికాకూడదనే విషయంపై సమయం తీసుకున్నామన్నారు. అయితే ఇందుకు బిషప్ కూడా ఒప్పుకున్నారని, చర్చికి సంబంధించి ఎన్నికలు జరుపుతున్న నేపథ్యంలో ఎస్సీలకు సంబంధించి బీసీ సర్టిఫికెట్లు అడిగారని.. అయితే దానికి తాను ఒప్పుకోకపోవడంతో కక్ష గట్టి ఇలా తమ స్కూలును దౌర్జన్యంగా కూల్చివేశారని ఆరోపించారు. ఇలా చేయడం వల్ల దాదాపు 250 మంది విద్యార్థుల జీవితాలు నాశనం కావా అని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కొంతమంది వైసీపీ పెద్దలు స్కూలు విక్రయించాలంటూ వస్తున్నారని, తాము ఎవరికీ ఇవ్వమని చెప్పడంతో.. ఇలా నానారకాలుగా బిషప్ వరప్రసాద్, అతని కుమారుడు ప్రశాంత్‌లు మానసికంగా ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆమె ఆరోపించారు. గతంలో కూడా ఇలాగే ఒత్తిడి తెచ్చారని, అయితే తాము కోర్టును కూడా ఆశ్రయించామన్నారు. ఈ నేపథ్యంలో ఎవరి అనుమతి లేకుండా స్కూలు భవనాన్ని కూల్చాల్సిన అవసరం ఏముందని ఆమె ప్రశ్నించారు. పాత రికార్డులను కూడా వారు తీసుకెళ్లారని, ఈ ఘాతుకానికి పాల్పడ్డవారిపై చర్యలు తీసుకుని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత ఉందని ఆమె అన్నారు. కాగా స్కూల్‌ను ధ్వంసం చేసినట్లు ఫిర్యాదు రావడంతో బిషప్ కొడుకు ప్రశాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. కాగా, సీఎస్ఐ చర్చి ఆవరణలోని హాస్టల్ గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో కూల్చివేశామని, ఈగదులలో నిర్వహిస్తున్న న్యూమోడల్ స్కూల్ అగ్రిమెంటు గడువు 2022తో ముగిసిందని సీఎస్ఐ రాయలసీమ డయాసిస్ సెక్రటరీ సి.సాల్మన్, ట్రెజరర్ కె.మేరీకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

రోడ్లు వేయరు.. గుంతలు పూడ్చరు

- ఏడాదిగా వేంపల్లె ప్రజల అవస్థలు

వేంపల్లె, మే 20 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో గత ప్రభుత్వంలో చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులు ఎన్నికల నేపథ్యంలో అర్ధాంతరంగా నిలిపివేశారు. దీంతో నిత్యం ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. వేంపల్లెలో కడప-పులివెందుల రోడ్డులో మురుగు కాల్వలు, కొత్త సిమెంటు రోడ్డు నిర్మాణం ఏర్పాటు చేయాలని గత వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది. రోడ్లు విస్తరించి ఈ పనులు చేపట్టేందుకు చర్యలు చేపట్టింది. ఎన్నికలకు ఆరు నెలల ముందు పులివెందుల రోడ్డులోని ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి సిమెంటు రోడ్డు మొదలుపెట్టి కందుల కాంప్లెక్స్ వరకు ఒకవైపు నిర్మించారు. రెండో వైపున రోడ్డు నిర్మించాల్సి ఉంది. అలాగే నాలుగు రోడ్ల కూడలి నుంచి కడప రోడ్డులో హనుమాన్ జంక్షన్ వరకు రోడ్డు వేయాల్సి ఉంది. దీంతో పాటు రోడ్డుకు ఇరువైపుల మురుగు కాల్వలను పూర్తి చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఎన్నికలు సమీపించడంతో మురుగుకాల్వలు, రోడ్డు పనులను నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాట య్యాక ప్రజల విజ్ఞప్తి మేరకు పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డికి విన్నవించారు. వారు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి కాంట్రాక్టర్‌తో పనులు చేయాలని కోరారు. అయితే పెండింగ్‌లో ఉన్న మురుగుకాల్వల పనులు చేసినప్పటికీ రోడ్డు పను లు చేపట్టలేదు. దీంతో రోడ్డు పనులు నిలిచిపోయి సరిగ్గా ఏడాది దాటిపోయింది.

ఎక్కడ పడితే అక్కడ గోతులు...

ఈ ఏడాది కాలంలో వేంపల్లెలోని ప్రధాన కడప- పులివెందుల రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఎక్కడ పడితే అక్కడ గోతులు ఏర్పడ్డా యి. గోతులను పూడ్చేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు ముందుకు రావడం లేదు. ఇదేమంటే కొత్త రోడ్డు శాంక్షన్‌లో ఉన్నందున పాత రోడ్డుకు మరమ్మతులు చేసేం దుకు నిధులు ప్రభుత్వం కేటా యించదని చెబు తున్నారు. దీంతో కొత్త రోడ్డు దేవుడెరుగు.. పాత రోడ్డులో కనీసం గుంతలనైనా పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

మినీ మహానాడులో తీర్మానం

వేంపల్లెలోని ప్రధానమైన కడప-పులివెందుల రోడ్డులో సిమెంటు రోడ్డు నిర్మాణం కోసం ప్రభు త్వానికి విజ్ఞప్తి చేయాలని మినీ మహానాడులో తీర్మానించారు. పులివెందులలో ఆదివారం టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి ఆధ్వర్యంలో జరిగిన మినీ మహానాడు కార్యక్రమంలో స్థానిక ప్రజల, నాయ కుల విజ్ఞప్తి మేరకు అ సమస్యను రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు.



వేంపల్లెలో రోడ్డు పనులు నిలిచిపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగిన దృశ్యం



వేంపల్లె బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిలో గోతులు

మహానాడును విజయవంతం చేయాలి





చలో కడప లోగో స్టిక్కర్లు విడుదల చేస్తున్న ముక్కా రూపానందరెడ్డి తదితరులు... మినీ మహానాడుకు హాజరైన కార్యకర్తలు, నాయకులు

- టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు,మే 20(ఆంధ్రజ్యోతి): కడపలో జరుగనన్న తెలుగు దేశం పార్టీ మహానాడు కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం రైల్వేకోడూరు రాజ్ కన్వెన్షన్ హాలులో మినీ మహానాడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరులో అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి మాట్లాడుతూ మహానాడు కార్యక్రమాన్ని కడపలో నిర్వహించడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్, ఉమ్మడి కడప జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎర్రగుండ్ల జయప్రకాష్, రాష్ట్ర తెలుగు యువత మాజీ అధ్యక్షుడు కట్టాబాలాజీనాయుడు, ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దుద్యాల అనితదీప్తి మాట్లాడుతూ మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మీ, మాజీ సర్పంచ్ మలిశెట్టి మురళీధర్‌గౌడ్, మైనార్టీ నాయకులు పఠాన్ మౌలా, జుబేర్, కూటమి నాయకులు కల్లా చలపతి, అనుముల గుండం చంద్రమోహన్, వాసుదేవరెడ్డి, గుత్తి నరసింహ, లారీ సుబ్బరాయుడు, బాలాంజనేయులు, కోడూరు పట్టణ అధ్యక్షులు పోకల మణి, ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

మినీ మహానాడులో తీర్మానాలు...

రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం కోసం మినీ మహానాడు కార్యక్రమంలో తీర్మానాలను ప్రకటించారు.చిట్వేలి-పెనగలూరు మండలాలలో సాగు-తాగునీటి అవసరాలకు సోమశిల వెనుక జలాలను తీసుకురావడం, కోడూరు-పెనగలూరు మధ్య గుంజన నదిపై ప్రతి 2 కిలోమీటర్ల దూరంలో చెక్‌డ్యాంలు నిర్మించడం, గాలేరు-నగిరి కాలువ నీటిని కోడూరు నియోజకవర్గ ప్రజలకు అందించడానికి చర్యలు తీసుకోవడం, కోడూరు-వెంకటగిరి రహదారి నిర్మాణం పూర్తి చేయడం, ఇందిరమ్మ ఇళ్లకు మరమ్మతులు చేయడం, కోడూరులో భూగర్భ డ్రైనేజి వ్యవస్థను ఏర్పాటు చేయడం, ఓబులవారిపల్లె-విజయవాడల మధ్య ప్యాసింజర్ రైలును ఏర్పాటు చేయించడం, శిథిలావస్థలో ఉన్న ఆర్‌టీసీ బస్టాండుకు నిధులు మంజూరు చేయించడం, యల్లంరాజు చెరువు మొండికట్ట నిర్మాణానికి అనుమతులు తీసుకురావడం, కోడూరులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడం, కోడూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పడకల సంఖ్యను పెంచడం, అరటి, మామిడి, బొప్పాయి పంటలకు మార్కెటింగ్ సౌకర్యం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు చేయించడం, పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడం, అప్పాజ్యూస్ పరిశ్రమను పునఃప్రారంభించడం, ఐదు మండలాలలో కమ్యూనిటీహాళ్ల నిర్మాణాలు చేపట్టడం, దేవదాయశాఖ, టీటీడీ సౌజన్యంతో దేవాలయాల నిర్మాణాలకు అనుమతి తీసుకరావడం, ఇండోర్ స్టేడియంలు, షాదీఖానాల ఏర్పాటు, అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పేదలకు వ్యవసాయ భూములు ఇవ్వడం తదితర కార్యక్రమా లను మినీ మహానాడులో తీర్మానించారు.

ఈకేవైసీ 30 లోపు పూర్తి చేయాలి

రైల్వేకోడూరు రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి): ఈకేవైసీ పక్రియను ఈ నెల 30 లోపు పూర్తి చేయాలని ఎన్‌ఫోర్సుమెంట్ డీటీ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎండీయూ, రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి రేషన్ షాపుల డీలర్లు ఈకేవైసీ పక్రియను ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించాలని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్, రీసర్వే డీటీ మానస, ఆర్‌ఐ లక్ష్మీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

నేటినుంచి వీరాంజనేయ జయంతి

ఒంటిమిట్ట, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోలుబుచ్చయ్యగారిపల్లె మంగంపేటలో వీరాంజనేయస్వామి ఆలయంలో జయంతి ఉత్సవాలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. బుధవారం ఉదయం 4 గంటల నుంచి గణపతిపూజతో జయంతి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 22న సీతారాముల కల్యాణోత్సవం, 23న ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులందరూ విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

దాతృత్వం అలవరుచుకోవాలి

నందలూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) :ప్రతిఒక్కరు దాతృత్వం అలవరుచుకోవాలని, ఇది హైందవ ధర్మం నేర్పిన జ్ఞానం అని ఎస్‌ఐ మన్నెం రామ్మోహన్ తెలియజేశారు. దివంగత చెంగారి సాయిప్రసన్నకుమారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ అరవపల్లెలోని గీతామందిరం ఆవరణంలో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వారి తండ్రి చెంగారి రామాంజనేయులు కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కుర్రా మణియాదవ్, నాయనపల్లె జయన్న, జంగంశెట్టి హరిబాబు, కొత్తపల్లె గంగాధర్‌ఆచారి, హెచ్‌డీ ప్రసాద్‌పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణాన్ని గ్రామ కమిటీకి అప్పజెప్పండి

ఓబులవారిపల్లె, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంగంపేట కాపుపల్లె, దళితవాడ, అరుంధతివాడ, పునరావాస కాలనీల్లో ఏర్పాటు చేస్తున్న రామాలయ నిర్మాణ బాధ్యతను గ్రామ ఆలయ కమిటీకి ఇవ్వాలని గ్రామస్థులు కోరారు. మంగళవారం మంగంపేట గ్రామస్థులు గుత్తిరెడ్డి హరినాథ్‌రెడ్డి, డీఆర్‌యూసీసీ సభ్యులు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, గ్రామ పెద్దలు ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దారు, సీపీవో ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సమావేశంలో వారు మాట్లాడారు. తహసీల్దారు శ్రీధర్‌రావు, సీపీవో సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ మినుకు సుధాకర్, గ్రామస్థులు కొలారు రమణారెడ్డి, గజ్జల శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి : ఎస్‌ఐ



వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి

నందలూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ తప్పకుండా ధరించాలని ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. కడప- చెన్నై ప్రధాన రహదారిలోని బాహుదానది వంతెన సమీపంలో మంగళవారం సాయంత్రం వాహన తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

రామాపురం, మే20(ఆంధ్రజ్యోతి): వంగిమళ్ల గ్రామానికి చెందిన మాదా రెడ్డెప్పరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన కుమార్తె అనితారెడ్డి, అల్లుడు లక్ష్మీశేఖర్‌రెడ్డి మనమడు యశ్వంత్‌రెడ్డి ప్రేమాలయ వృద్ధాశ్రమంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. ఆశ్రమం మేనేజర్ సుబ్బయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీల షెడ్యూల్‌ను విడుదల చేయాలి

● నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నేతలు



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రాయచోటి టౌన్, మే20(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండూరు శ్రీనివాసరాజు, బొనిగల హైమారావు, కడప జిల్లా అధ్యక్షుడు ఏబీ రామక్రిష్ణంరాజు డిమాండ్ చేశారు. మంగళవారం వారు విజయవాడలో పాఠశాల విద్యా కమిషనర్ కే. విజయరామరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:45గా తీసుకోవాలని కోరగా 1:49 వరకు తీసుకునే అవకాశం ఉందని కమిషనర్ తెలిపారన్నారు. అలాగే బదిలీల షెడ్యూల్ గురించి కోరగా ఎస్జీటీల మాన్యువల్ కౌన్సెలింగ్‌కు సానుకూలంగా స్పందించారన్నారు. తెలుగు మీడియంను ప్రవేశ పెట్టాలని కోరగా మండలానికి ఒక తెలుగు మీడియం ఏర్పాటుకు ప్రయత్నం జరగవచ్చునని తెలిపారన్నారు. అలాగే ఏప్రిల్ 30 వరకు రేషనలైజేషన్ కట్ ఆఫ్ తేదీ పెట్టాలని కోరగా మార్చి 31 నాటికి విద్యార్థులు ఎక్కువ ఉన్నారని పేర్కొన్నారన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో లాంగ్వేజ్ పండిట్‌లు కొనసాగించాలని కోరగా కమిషనర్ సానుకూలంగా స్పందించారన్నారు. దాదాపు బుధవారం బదిలీల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉందని కమిషనర్ విజయరామరాజు తెలిపినట్లు వారు వివరించారు.


వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

రాజంపేట టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి):జర్నలిస్టుల సంక్షేమం కోసం బుధవారం రాజంపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిబిరాన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ నాగేశ్వర్‌రాజు అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు ఆయనతో సమావేశమయ్యారు.

ఆడపిల్లల పట్ల వివక్ష తగదు

రామాపురం, మే20(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లల పట్ల వివక్ష తగదని లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి వై. పద్మావతి అన్నారు. మండలంలోని గువ్వలచెరువు సెక్టార్ కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ సూర్యనారాయణపురం, చిట్లూరు సెక్టార్ బండపల్లి పంచాయతీ వెంకటరెడ్డిగారిపల్లెలో మంగళవారం జరిగిన సమ్మర్ కోచింగ్‌లో కిశోర బాలికల వికాసం కార్యక్రమానికి సీడీపీవో హాజరయ్యారు. రామాపురం సెక్టార్ హసనాపురం పంచాయతీ కస్పాలో సూపర్‌వైజర్ హాస్నేనమ్మ హాజరయ్యారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మజారాణి, సుజాత, జీయంఎస్‌కేలు రజినిరాణి, అంగన్వాడీ కార్యకర్తలు మాబుజాన్, జయమ్మ, రమణమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

కంచాలమ్మ చెరువు నీటి సంఘం చైర్మన్ రఘునాథరెడ్డి మృతి



నీటి సంఘం చైర్మన్ రఘునాథరెడ్డి (ఫైల్)

రాయచోటి టౌన్,మే20(ఆంధ్రజ్యోతి): అర్చనా విద్యాసంస్థల కరస్పాడెంట్ డాక్టర్ పీ. మదన్‌మోహన్‌రెడ్డి తండ్రి కంచాలమ్మ గండి చెరువు నీటి సంఘం అధ్యక్షుడు పాపిరెడ్డి రఘునాథరెడ్డి (80) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. రఘునాథరెడ్డికి భార్య బాలనాగమ్మ, కుమారులు జయరామిరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. రఘునాథరెడ్డి అంత్యక్రియలు బుధవారం ఉదయం 10 గంటలకు మున్సిపాలిటీ పరిధిలోని గాలివీడు రోడ్డులో గల ఎగువ అబ్బవరం కటవ కింద పాపిరెడ్డిగారిపల్లెలో జరుగుతాయన్నారు.

పక్కా గృహాలు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న మురళీకృష్ణ

చిట్వేలి, మే 20 (ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో పూరిగుడిసెలు లేకుండా అన్నీ పక్కా గృహాలు ఉండేలా చూడాలని గృహ నిర్మాణశాఖ రాజంపేట డివిజనల్ అధికారి మురళీకృష్ణ చిట్వేలి మండల గృహనిర్మాణశాఖ ఏఈ సుధాకర్‌ను ఆదేశించారు. ఏఈ సుధాకర్‌తో కలిసి మంగళవారం మండల పరిధిలోని రాజారెడ్డి ఎస్టీ కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైలపల్లె పంచాయతీలోని వైఎస్ఆర్ ఎస్టీకాలనీలో 60 కుటుంబాలు నివాసం ఉండగా 20 కుటుంబాలు వారు పూరిగుడిసెల్లో నివసిస్తున్నారని,వారికి పక్కా గృహాలు మంజూరు చేశామన్నారు. ఎక్కడా పూరిగుడిసెలు లేకుండా పక్కా గృహాలు మంజూరు చేయాలని ఆదేశించారని ఏఈ తెలిపారు.

ఒండ్రుమట్టి పేరుతో ఇసుక దోపిడీ



టక్కోలి పెన్నానదిలో ఇసుక అక్రమ తరలింపునకు సిద్ధం చేసిన ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లు

సిద్దవటం, మే 20 (ఆంధ్రజ్యోతి) : భూమి సాగు కోసం పెన్నానదిలో ఒండ్రుమట్టి తరలింపునకు అనుమతులు పొంది ఇసుక దోపిడీ జరుగుతోంది. మండలంలోని పాత టక్కోలి గ్రామం పెన్నానది నుంచి భూమి సాగు కోసం ఒండ్రుమట్టి తరలింపునకు ఆ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అధికారుల నుంచి 100 ట్రిప్పులు అనుమతి పొందాడు. కానీ ఆ ముసుగులో కొందరు మంగళవారం పట్టపగలే ఎక్స్‌కవేటర్ యంత్రంతో ఇసుక తవ్వకాలు చేపట్టి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. అయినా రెవెన్యూ, పోలీసులు అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. అధికారులు నిర్ధారణ చేసి అనుమతులు ఇవ్వాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి మండల తహసీల్దారు మాధవీలతను వివరణ కోరగా ఒండ్రుమట్టి తరలింపునకు మాత్రమే అనుమతులు ఇచ్చామని, విచారించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం: వైసీపీ



సమావేశంలో పాల్గొన్న వైసీపీ నేతలు

రాయచోటిటౌన్, మే20(ఆంధ్రజ్యోతి): వైసీపీని సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో అన్నమయ్య జిల్లాలోని ఆరు నియోజకవర్గాల వైసీపీ ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వైసీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, రాజంపేట పార్లమెంట్ పరిశీలకుడు సురేశ్‌బాబు, తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, పీలేరు ఇన్‌చార్జి చింతల రామచంద్రారెడ్డి, రైల్వేకోడూరు ఇన్‌చార్జి కొరముట్ల శ్రీనివాసులు, మదనపల్లె ఇన్‌చార్జి నిస్సార్ అహ్మద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథరెడ్డి మాట్లాడుతూ వైసీపీ జాతీయ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాలో పార్టీని బలోపేతం చేసి అభివృద్ధిలో రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుతామన్నారు.

కోడూరు నియోజకవర్గంలో విద్యుత్ బకాయిలు రూ.129.34 కోట్లు



రైల్వేకోడూరు ప్రధాన విద్యుత్ సరఫరా సబ్‌స్టేషన్

రైల్వేకోడూరు, మే 20(ఆంధ్రజ్యోతి):విద్యుత్ బకాయిలు రూ. కోట్లల్లో పేరుకుపోతున్నాయి. దీంతో విద్యుత్ శాఖ ఆదాయానికి గండిపడుతోంది. సక్రమంగా వసూళ్లు రాకపోవడంతో విద్యుత్ శాఖాధికారులకు తలనొప్పిగా మారింది. రైల్వేకోడూరు, చిట్వేలి, పెనగలూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట మండలాలలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు రూ.129.34 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఇందులో మొండి బకాయిలు కూడా ఉన్నాయి. అధికారులు, సిబ్బంది కలిసి బకాయిలు ఉన్నాయని, చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నా లబ్ధిదారులు వాటి చెల్లింపులో జాప్యం చేస్తున్నారు. కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు మాత్రం బడ్జెట్ రాగానే చెల్లించేస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.... రైల్వేకోడూరు మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలకు కలిపి రూ.29.92 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఓబులవారిపల్లె మండలంలో 22 గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాలకు కలిపి రూ.66.60 కోట్లు, చిట్వేలి మండలంలో 21 గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.19.64 కోట్లు, పుల్లంపేట మండలంలోని 15 గ్రామ పంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాలు కలిపి రూ.4.34 లక్షల బకాయిలు ఉన్నాయి. అలాగే పెనగలూరు మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో ఉన్న అన్ని ప్రభుత్వ కార్యాలయాలు రూ.8.84 లక్షల బకాయిలు ఉన్నాయి. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాల్లో విద్యుత్ బకాయిలు మొత్తం సుమారు రూ.129.34 కోట్లు ఉన్నాయి. బకాయిలు చెల్లింపులు జరగకపోవడంతో ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నారు. బకాయిలపై నిరంతరాయంగా దృష్టి పెట్టినా వసూళ్లు కావడం లేదని సిబ్బంది అంటున్నారు.

విద్యుత్ శాఖాధికారులు ఏమంటున్నారంటే...

విద్యుత్ బకాయిల వసూళ్ల కోసం తమ సిబ్బంది నిరంతరాయంగా వెళుతున్నారని, వసూళ్ల విషయంలో వత్తిళ్లు చేస్తున్నారని (రైల్వేకోడూరు, చిట్వేలి, పుల్లంపేట, ఓబులవారిపల్లె, పెనగలూరు) ఐదు మండలాల విద్యుత్‌శాఖాధికారులు చెబుతున్నారు. సిబ్బంది మాట వినని వారి వద్దకు తామే స్వయంగా వెళుతున్నామన్నారు. చాలా వరకు మొండి బకాయిలు ఉన్నాయని చెబుతున్నారు. కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు మాత్రం సక్రమంగా చెల్లిస్తున్నారని తెలిపారు.

నిరుపయోగంగా టూరిస్టు పోలీసు కేంద్రం



మూతపడిన టూరిస్ట్ పోలీసు కేంద్రం

ఒంటిమిట్ట, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట కోదండరామాలయం సమీపంలో ఏర్పాటు చేసిన టూరిస్ట్ పోలీసు కేంద్రం నిరుపయోగంగా మారింది. గత ప్రభుత్వం 2023లో కోదండరామాలయం సమీపంలో టూరిస్టు పోలీసు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కొద్దిరోజుల పాటు సిబ్బందిని నియమించి భక్తులు, ప్రజలకు సేవలు అందించారు. అనంతరం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని బదిలీ చేయడంతో టూరిస్టు పోలీసు కేంద్రం మూతపడింది. ఈ భవనాన్ని ముందుగా టీటీడీ వారు బస్సు షెల్టర్ నిమిత్తం తాత్కాలికంగా నిర్మించారు. కొద్దిరోజుల తర్వాత పోలీసు అధికారులు భవనాన్ని స్వాధీనం చేసుకుని టూరిస్టు పోలీసు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం భక్తులు, ప్రయాణికులు ఒంటిమిట్టలో బస్సుషెల్టర్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ భవనం బస్సు షెల్టర్‌గాను, టూరిస్టు పోలీసు కేంద్రంగాను ఉపయోగపడడంలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం మూతపడడంతో చుట్టూ పరిసరాలు కంపచెట్లు, పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. అధికారులు స్పందించి ఈ భవనం భక్తులకు, ప్రయాణికులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అవుట్ పోస్టుకు ఉపయోగించుకుంటాం

టూరిస్ట్ పోలీసు కేంద్రాన్ని పోలీసు త్వరలో అవుట్ పోస్టుగా ఉపయోగించుకుంటాం. గత ప్రభుత్వంలో ఆలయాల వద్ద టూరిస్ట్ పోలీసు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అన్నిచోట్ల టూరిస్ట్ పోలీసు కేంద్రాల్లో సిబ్బందిని నియమించలేదు.

- బాబు, సీఐ, ఒంటిమిట్ట

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



టీడీపీ కండువా వేసుకున్న రంగారెడ్డి తదితరులు

పెనగలూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రమైన పెనగలూరుకు చెందిన వైసీపీ నాయకులు గణపతిరెడ్డి రంగారెడ్డి మంగళవారం టీడీపీలో చేరారు. మంగళవారం కోడూరులో జరిగిన మినీ మహానాడు సమావేశంలో రంగారెడ్డి తన అనుచరులతో టీడీపీ కండువా వేసుకున్నారు. కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి టీడీపీ కండువా కప్పి అభినందించారు. కాగా రంగారెడ్డి, ఆయన సతీమణి మల్లీశ్వరమ్మ గతంలో టీడీపీ మండల అధ్యక్షులుగా, పెంచలకోన దేవస్థానం ధర్మకర్తలుగా రెండేసిమార్లు పనిచేశారు. 2019 సాధారణ ఎన్నికల్లో వైసీపీలో చేరారు. పెనగలూరు మాజీ ఎంపీటీసీ కలివెల గంగాధరమ్మ, మాజీ ఆర్టీసీ డ్రైవర్ సింగనమల సుధాకర్, ఓబిలి నీటిసంఘం అధ్యక్షులు దుర్గయ్య, పెనగలూరుకు చెందిన కొత్త రాధాకృష్ణయ్య పాల్గొన్నారు.

విద్యార్థికి చమర్తి, మేడా నివాళి

సుండుపల్లె, మే20(ఆంధ్రజ్యోతి): రాయవరం సర్పంచ్ షరీఫ్ సోదరుడు ఎంటెక్ చదువుతున్న విద్యార్థి సయ్యద్ మహమ్మద్ మృతి చెందడంతో టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి వారు మంగళవారం నివాళులర్పించారు. విద్యార్థి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, టీడీపీ నాయకులు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

సుండుపల్లె, మే20(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి రామలక్ష్మి తెలిపారు. మంగళవారం ముడుంపాడు సచివాలయంలో కిశోర వికాసం అనే నినాదంతో బేటీబచావో బేటీపడావో అనే అంశంపై ఆయన మాట్లాడారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను రద్దు చేయాలి: సీఐటీయూ

రైల్వేకోడూరు, మే 20(ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం రైల్వేకోడూరు గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న పాత కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు. 29 కార్మిక చట్టాలను, పెట్టుబడిదారులకు అనుకూలంగా, నాలుగు లేబర్ కోడ్లను కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకుని వచ్చిందన్నారు. తక్షణం వాటిని రద్దు చేయాలన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి పీ.జాన్‌ప్రసాద్, ఉపాధ్యక్షుడు లింగాల యానాదయ్య, కోశాధికారి హరినారాయణ, మంగంటపే మైనింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పొలగంటి శ్రీనివాసులు, ముత్యాల శ్రీనివాసులు, రాజశేఖర్, విజయ్, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం ఉంటే ఉద్యోగాలే వెతుక్కుంటూ వస్తాయి : చమర్తి



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదివే విద్యార్థులు మంచి నైపుణ్యాలు కలిగి ఉంటే ఉద్యోగం కోసం మనం వెతుక్కోవాల్సిన అవసరం లేదని, ఆ ఉద్యోగమే మనల్ని వెతుక్కొంటూ వస్తుందని అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు విద్యార్థులకు తెలియజేశారు. ఏపీ స్కిల్‌డెవలప్‌ఎమెంట్ ఆధ్వర్యంలో రాజంపేట పాలిటెక్నికల్ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళా కార్యక్రమానికి జగన్‌మోహన్‌రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలిటెక్నికల్ కళాశాలలో ప్రస్తుతం స్కిల్‌హబ్ ఉందని తెలిపారు. ఎవరికైనా ఉద్యోగాలు రాకుండా ఉంటే ఇక్కడ శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.సుధాకర్ మాట్లాడుతూ తమ కళాశాలకు 2 కోర్సులు అవసరమున్నాయని, వీటికి ప్రతిపాదనలు కూడా పంపించామని, ఆ కోర్సులు వెంటనే మంజూరు చేయించేందుకు కృషి చేయాలని కోరారు. స్పందించిన ఆయన వచ్చే యేడాది తప్పనిసరిగా మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం పాలిటెక్నికల్ కళాశాలలపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, లక్షల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారని అన్నారు. ప్రతిభను కనబరిస్తే ఉద్యోగం తప్పనిసరిగా వస్తుందన్నారు. ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్‌తో పాటు కళాశాల అధ్యాపకులు, తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న చమర్తి

వీరబల్లి, మే20(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆహ్వానం మేరకు శికారుపాలెంలో జరిగిన భవానీ అమ్మవారి ఉత్సవాలకు మంగళవారం రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను స్థానికులు చమర్తి దృష్టికి తీసుకువచ్చారు. ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. మండల అధ్యక్షుడు, టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మాకూ పదోన్నతులు ఇవ్వండి

- వైసీపీ హయాంలో అడ్డగోలుగా ప్రిన్సిపాల్స్ పదోన్నతి
- ఇంటిగ్రేటెడ్ సీనియారిటీని ఖాతరు చేయని వైనం
- ప్రమోటీ జూనియర్ లెక్చరర్లకు తీవ్ర అన్యాయం
- న్యాయం చేయాలని మంత్రి లోకేశ్‌కు ప్రమోటీల ఫిర్యాదు


పీలేరు రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో ఇంటిగ్రేటెడ్ సీనియారిటీ జాబితాలో ఉన్న ప్రమోటీ జూనియర్ లెక్చర్లను పక్కన పెట్టి జూనియర్స్ అయిన డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో వచ్చిన వారికి ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతి కల్పించారు. దీంతో ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న ప్రమోటీ జూనియర్ లెక్చరర్లకు తీవ్ర అన్యాయం జరిగిందని పలువురు వాపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అన్యాయంపై తమకు న్యాయం చేయాలని కోరుతూ ప్రమోటీ జూనియర్ లెక్చరర్లు రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేశ్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. 1998, 1999, 2000, 2001లో కామన్ సీనియారిటీ ద్వారా స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు. పదోన్నతి పొందిన జూనియర్ లెక్చరర్లకు రెగ్యులరైజేషన్ జరిగి ఇంటిగ్రేటెడ్ సీనియారిటీ ప్రకారం 2018 వరకు ప్రిన్సిపాల్స్‌గా, డిగ్రీ కళాశాల లెక్చరర్స్‌గా పదోన్నతి పొందారు. అడ్డగోలు సంస్కరణలకు మారుపేరైన జగన్ ఏలుబడిలో 2024 ఎన్నికల కోడ్ వెలువడడానికి ముందురోజు అంటే మార్చి 15న ఇంటిగ్రేటెడ్ సీనియారిటీ లిస్ట్‌లో ఉన్న ప్రమోటీ జూనియర్ లెక్చరర్స్‌ను పక్కన పెట్టి జూనియర్స్ అయిన డైరెక్ట్ రిక్రూట్స్ మాత్రమే 197 మందికి ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతి కల్పించారు. దీంతో సీనియర్స్‌కు తీవ్ర అన్యాయం జరిగింది.

తమకు జరిగిన అన్యాయంపై న్యాయం చేయాలని విద్యాశాఖ మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఇదేమీ పట్టించుకోని ఇంటర్ బోర్డు అధికారులు జగన్ జమానాలో ఇచ్చినట్లే మరో 110 మందికి ప్రిన్సిపాల్స్‌గా పదోన్నతి ఇచ్చారు. అటు జగన్ ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ డైరెక్ట్ రిక్రూట్స్‌కు మాత్రమే న్యాయం చేయడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమోటీ జూనియర్ లెక్చరర్స్‌కు ప్రిన్సిపాల్ ప్రమోషన్‌కు సంబంధించిన జీవో 302 ఇప్పటికీ అమలులో ఉండగా అసంబద్ధ రిపోర్ట్ ఆధారంగా ఒకే వర్గానికి లబ్ధి చేకూరేలా వ్యవహరించడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఒకే క్యాడర్‌లో 25 సంవత్సరాలకు పైగా సేవలు అందిస్తూ ప్రమోషన్స్‌కు అన్ని అర్హతలున్నా పక్కన పెట్టడం చాలా అన్యాయమని వాపోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 210 మంది ప్రమోటీలు జూనియర్ లెక్చరర్లుగా పనిచేస్తున్నారు. వీరిలో చాలా మంది 2030 నాటికి పదవీ విరమణ పొందుతారు. ఇప్పటికైనా ప్రభుత్వం సీనియర్స్ అయిన ప్రమోటీ జూనియర్ లెక్చరర్లకు న్యాయం చేయాలని కోరుతున్నారు.హైస్కూల్ ప్లస్, వాటి స్థానంలో ఏర్పడే జూనియర్ కళాశాలలకు ప్రిన్సిపాల్స్‌గా నియమించాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యాశాఖ మంత్రి వాస్తవాలను గుర్తించి ప్రమోటీ జూనియర్ లెక్చరర్లకు న్యాయం చేయాలని కోరుతున్నారు.


మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం (ఫైల్)

మంత్రి నారా లోకేశ్ చొరవ చూపాలి...



ప్రిన్సిపాల్స్ ప్రమోషన్లలో మాకు జరిగిన అన్యాయంపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవ చూపాలి. 2018 వరకు కొనసాగిన ఇంటిగ్రేటెడ్ సీనియారిటీ విధానాన్ని అమలు చేయాలి. గత ప్రభుత్వంలో మాకు అన్యాయం చేశారు. పలుమార్లు ఇంటర్ బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదు. ఇంకెంత కాలం వేచి చూడాలి.

- డి.మురళీధర్, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ సంఘం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.

ప్రమోషన్ లేకుండా పదవీ విరమణ బాధాకరం



ప్రమోషన్ లేకుండా పదవీ విరమణ చేయడం బాధాకరం. ఒకే క్యాడర్‌లో ఉంటూ జూనియర్స్ ప్రిన్సిపాల్స్ కావడం, సీనియర్లు అలాగే కొనసాగడం బాధాకరం. మంత్రితో పాటు ఇంటర్ బోర్డు అధికారులు వాస్తవాలను గుర్తించి న్యాయం చేయాలి. 25 నుంచి 30 సంవత్సరాలు పదోన్నతి లేకుండా ఒకే క్యాడర్‌లో కొనసాగి పదవీ విరమణ పొందడం శోచనీయం.

- నాగసురేష్, జూనియర్ లెక్చరర్స్ సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్.

ఐదుగురు పీఆర్ రిటైర్డు ఇంజనీర్లకు భారీ జరిమానా

- నిధుల రికవరీతో పాటు పెన్షన్‌లలో కోత
- కమలాపురం మండలంలో జరిగిన పనుల్లో అక్రమాల ఫలితం

కలికిరి, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేసిన ఐదుగురు పంచాయతీరాజ్ శాఖ ఇం జనీర్లకు ప్రభుత్వం భారీగా జరిమానా విధించింది. కమలాపురం మండలంలో జరిగిన పనుల్లో వెలికితీసిన అక్రమాల్లో ఒక సూపరింటెండింగ్ ఇంజనీరు కూడా భాగస్వామి కావడం విశేషం. ఉమ్మడి ఏపీలో 2010లో జరిగిన వివిధ పనుల్లో జరిగిన అవినీతి కారణంగా 15 ఏళ్ల తరువాత విచారణలు ఒక కొలిక్కి రాగా తాజాగా మంగళవారం దీనికి సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. కాగా ఈ ఐదుగురు ఇంజనీర్లు ప్రస్తుతం రిటైరు అయ్యారు. వివరాలిలా ఉన్నాయి. కమలాపురం మండల పరిషత్తు నిధుల నుంచి వివిధ గ్రామాల్లో సిమెంటు రోడ్లు, స్ప్రింగ్ చానెళ్ళు, వంకలకు రక్షణ గోడలులాంటి పనులు జరిగాయి. అయితే బిల్లుల చెల్లింపులో అనేక అక్రమాలు జరిగినట్లు 2012లో విజిలెన్స్ తనిఖీల్లో వెలుగు చూసింది. ఈ అక్రమాలపై పలు రకాల విచారణలు జరిగాయి. పలువురు విచారణాధికారులను నియమించి నిధుల దుర్వినియోగం గురించి నిగ్గు తేల్చారు. చివరికి ఐదుగురు ఇంజనీర్లను బాధ్యులుగా నిర్ధారించారు. వీరి నుంచి పలు దఫాలు వివరణలు కూడా తీసుకున్నారు. వీరంతా ప్రస్తుతం రిటైరయ్యారు. ఇందులో అప్పట్లో కడప సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీరుగా పనిచేసిన కె.వి.గోవిం దరావు పెన్షన్‌లో 2 శాతం కోత విధించారు. ఈ పనులు పర్యవేక్షించిన అప్పటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు జి.సురేంద్రనాథ్ పెన్షన్‌లో 5 శాతం కోత విధించారు. అంతేగాకుండా దు ర్వినియోగమైన నిధుల్లో రూ.2,56,748 ఆయ న నుంచి రికవరీకి ఆదేశించారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పనిచేసిన డి.దేవదాస్ పెన్షన్‌లో 15 శాతం కోత విధించారు. దుర్వినియోగమైన నిధుల్లో రూ.20,18,390 రికవరీకి ఆదేశించారు. అసిస్టెంట్ ఇంజనీరుగా పనిచేసిన జి.రామమోమహన్‌రెడ్డి పెన్షన్‌లో 3 శాతం కోత విధించడంతో పాటు రూ.45,380లు రికవరీ చేయనున్నారు. మరో ఏఈ వి.వి.సుబ్బారెడ్డి పెన్షన్‌లో 15 శాతం కోత విధించడంతో పాటు రూ.13,73,074 రికవరీకి ఆదేశించారు. అందరి నుంచి కలిపి రూ.36,93,592 రికవరీ చేయనున్నారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్‌కుమార్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

కోదండరాముడిని దర్శించుకున్న జడ్జిలు


పూర్ణకుంభంతో జడ్జిలకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

ఒంటిమిట్ట, మే 20 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండ రామాలయాన్ని మంగళవారం ఉదయం సత్తెనపల్లె సీనియర్ సివిల్‌జడ్జి విజయ్‌కుమార్‌రెడ్డి, విజయనగరం జిల్లా లీగల్‌సెల్ అథారటీ జడ్జి కృష్ణప్రసాద్, కైకలూరు సివిల్‌జడ్జి కిరణ్‌కుమార్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వీర రాఘవాచార్యులు వారికి స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. ఈ సందర్భంగా వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ చరిత్ర గురించి అర్చకులు వీణా రాఘవాచార్యులు వివరించారు. ఆలయంలో శిల్ప సంపద అద్భుతంగా ఉందని జడ్జిలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం జూనియర్ సివిల్‌జడ్జి, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- 125 గ్రాముల బంగారం, అర కేజీ వెండి, రూ.50 వేలు అపహరణ

మదనపల్లె అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి): తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి నగలు , నగదు అపహరించుకు వెళ్లారు. మదనపల్లె మండలం చిప్పిలి గ్రామంలోని సురభి కాలనీలో నాగపరిమళ, శంకర్ రెడ్డి దంపతులు నివసిస్తున్నారు. సోమవారం ఉదయం ఆమె డ్యూటీకి వెళ్లగా, మధ్యాహ్నం భర్త ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉండడం కనిపించింది. దీంతో లోపలికి వెళ్లి పరిశీలించగా బీరువాలోని 125 గ్రాములు బంగారు, అర కేజీ వెండి వస్తువులు, రూ.50 వేలు నగదు చోరీకి గురైనట్లు తెలిసింది. తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ కళా వెంకటరమణకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దేవదాయ భూములను పరిరక్షించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దేవాదాయ శాఖ భూములను పరిరక్షించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో దేవదాయ భూముల పరిరక్షణపై జిల్లా స్థాయి భూసంరక్షణ కమిటీ సభ్యులతో కలెక్టర్ అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 9761 ఎకరాల దేవాలయ భూములు ఉన్నాయన్నారు. ఈ భూములన్నింటినీ కూడా తప్పనిసరిగా సంరక్షించాలన్నారు. ఎక్కడైనా ఆక్రమణకు గురై ఉంటే వెంటనే గుర్తించి వాటిని తొలగించాలని ఆదేశించారు. జిల్లాలో ఆక్రమణలో గుర్తించిన 1167.52 ఎకరాల భూముల్లో ఉన్న ఆక్రమణలను తొలగించాలని, ఇందుకు సంబంధించి ఏదేని కోర్టుల్లో కేసులు ఉన్న వాటికి వెంటే స్టే వెకేషన్ కొరకు కౌంటర్ దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తంగా ఉన్న 9761 ఎకరాలకు గానూ గత సెప్టెంబరు నెలలో నిర్వహించిన సమావేశం నాటికి 4866 ఎకరాల భూములు వన్‌బీ, అడంగల్‌లో దేవదాయ పేర్లు నమోదయ్యాయని, ప్రస్తుతం 5500 ఎకరాలకు సంబంధించిన వన్‌బీలో పేర్లు నమోదు కావడం జరిగిందన్నారు. ఇంకా దాదాపు 2200 పైబడిన భూములకు వెంటనే వన్‌బీ, అడంగల్‌లో సంబంధిత దేవాలయ పేర్లు నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూశాఖ అధికారులను ఆదేశించారు. దేవదాయశాఖ అధికారి విశ్వనాద్ మాట్లాడుతూ జిల్లాలో ఆలయాలకు చెందిన 5700 ఎకరాల భూములు ఖాళీగా ఉన్నాయని, వాటిని గుర్తించాల్సి ఉందన్నారు. భూములను గుర్తించి లీజుకు ఇవ్వడం ద్వారా దేవాలయాల ఆర్థిక స్థితి మెరుగు పరుడుతుందని కలెక్టర్‌కు వివరించారు. అనంతరం వివిధ అంశాల్లో చర్చించి పలు సూచనలు జారీ చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఈవోలు, తనిఖీదారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

యోగాంధ్ర కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలి

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 21 నుంచి జూన్ 21వ తేదీ వరకు జిల్లాలో యోగాంధ్ర-2025 కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ శారీరక, మానసిక ప్రశాంతతతో పాటు ఒత్తిడిని తగ్గించేందుకు యోగా ఉన్న ఉత్తమమైన సాధనమన్నారు. జూన్ 21న విశాఖపట్నం రామకృష్ణ బీచ్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమక్షంలో జరిగే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జిల్లాలో కూడా యోగాంధ్రపై ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈనెల 21న జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, యోగా శిక్షకులు, యోగా అభ్యాసకులు, పీఈటీలు తదితరులతో ఒక కర్టెన్ రైజర్ నిర్వహించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాల పెంపుపై శిక్షణ

సంబేపల్లె, మే 20 (ఆంధ్రజ్యోతి): నాయకత్వ లక్షణాల పెంపుపై సిమాట్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు శిక్షణ తరగతులను ఏర్పాటు చేసినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తెలిపారు. విజయవాడలో ఈ నెల 19వ తేదీ నుంచి మే 23వ తేదీ వరకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణా తరగతులకు అన్నమయ్య జిల్లా నుంచి పది మంది ప్రిన్సిపాళ్లు ఎంపికయ్యారని, వారు తరగతులకు హాజరవుతున్నట్లు తెలిపారు. తరగతులకు హాజరైన ప్రిన్సిపాళ్లు వారి ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు లీడర్షిప్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.


శిక్షణకు హాజరైన జిల్లాలోని వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు

నీటి సంఘం ఎన్నికకు గ్రహణం

- వర్గపోరు కారణంగా వాయిదా
- అభివృద్ధికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపించని వైనం
- ఆవేదన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

సుండుపల్లె, మే 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నీటి సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు పచ్చజెండా ఊపింది. రాష్ట్ర వ్యాప్తంగా గత ఏడాది డిసెంబరు 14వ తేదీ నీటి సంఘం ఎన్నికలు జరగ్గా పింఛా ప్రాజెక్టు ఎన్నికలు మాత్రం 17వ తేదీ జరుపుతుండగా టీడీపీలో వర్గ పోరు కారణంగా ఎన్నిక అర్ధంతరంగా ఆగిపోయింది. రాజంపేట నియోజకవర్గంలోని కీలక నేతలు తమ వర్గంలోని వారినే పింఛా నీటి సంఘం చైర్మన్‌గా ఎన్నిక చేయాలని పట్టుబట్టడంతో టీడీపీలోని నాయకుల మధ్య పరస్పరం దూషణలు, కొట్టుకునే స్థాయికి చేరింది. ఈ పరిస్థితుల్లో రాజంపేట సబ్ కలెక్టర్ నిదియాదేవి నీటి సంఘం ఎన్నిక ప్రక్రియ జరుగుతున్న ప్రదేశానికి చేరుకుని ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తరువాత ఎన్నిక నిర్వహణకు నోటిఫికేషన్ జారీ కాలేదు. ఎన్నిక జరగకపోవడం ప్రాజెక్టుకు దిగువ భాగంలో ఉండే రైతాంగానికి శాపంగా మారిందని చెప్పుకోవచ్చు. వేసవిలో కూడా ప్రాజెక్టులో పుష్కలంగా నీరు నీరు ఉన్నా కుడి, ఎడమ కాలువల మరమ్మతులు చేయకపోవడం వలన చివరి ఆయకట్టు రైతుకు నీరు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నోటిఫికేషన్ వస్తే నిర్వహిస్తాం

ప్రాజెక్టు నీటి సంఘం ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ వస్తే ఎన్నికలు నిర్వహిస్తాము. పింఛా ప్రాజెక్టు అభివృద్ధికి నిధులు అవసరం ఉంది. నీటి సంఘం ఎన్నికలు జరిగిన కుంటలు, చెరువుల అభివృద్ధికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపించాము. పింఛా ప్రాజెక్టు అభివృద్ధి నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపిస్తాము.

- నాగేంద్రనాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, పింఛా ప్రాజెక్టు

నిధులు వచ్చేదెలా..?

సుండుపల్లె మండల వ్యాప్తంగా రెండు కుంటలు, రెండు చెరువులు ఒక ప్రాజెక్టుకు ఎన్నికలు జరగాల్సి ఉండగా రెండు కుంటలు, రెండు చెరువులకు నీటి సంఘం ఎన్నికలు జరిగాయి. అయితే ఆ రెండు కుంటలు, రెండు చెరువుల కంటే ఎర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి పింఛా ప్రాజెక్టు అధికారికంగా సుమారు 3773 ఎకరాల సాగు భూమికి, అనధికారికంగా మరో 1500 ఎకరాల సాగుభూమికి సాగునీటిని అందిస్తోంది. ఏప్రిల్, మే నెలలోనూ ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాలువల ద్వారా రైతాంగానికి నీరు అందిస్తున్న ఏకైక ప్రాజెక్టు పింఛా ప్రాజెక్టు. అయితే కాలువల్లో కొన్ని చోట్ల మరమ్మతులు చేయకపోవడంతో చివరి ఆయకట్టు వరకు నీరందడం లేదు. నీటి సంఘం ఎన్నికలు జరిగి ఉంటే ప్రభుత్వానికి అభివృద్ధి నిధుల కోసం ప్రతిపాదనలు పంపించి ఉండేవారు. ఎన్నికలు జరిగిన కుంటలు, చెరువులకు అభివృద్ధి కోసం నిధులు కావాలని ప్రతిపాదనలు పంపించారు. కానీ రైతులకు అండగా ఉండి సాగునీటిని అందిస్తున్న పింఛా ప్రాజెక్టుకు మాత్రం ప్రతిపాదనలు పంపించలేదు. ఇందుకు ప్రధాన కారణంగా నీటి సంఘం ఎన్నికలు జరగకపోవడమే కారణమని స్పష్టంగా తెలుస్తోంది. త్వరగా నీటి సంఘం ఎన్నికలు నిర్వహించేలా పై అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి నీటి సంఘం ఎన్నిక ప్రక్రియ పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.



టీచర్ల ప్రిఫరెన్షియల్ బదిలీల కోసం

నేడు ప్రత్యేక వైద్య శిబిరం

కలికిరి, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన స్టేట్ టీచర్స్ ట్రాన్స్‌ఫర్స్ రెగ్యులేషన్ యాక్టు మేరకు త్వరలో జరగనున్న బదిలీల కోసం వైద్య కారణాలతో ప్రాధాన్యత (ప్రిఫరెన్షియల్) పొందగోరే ఉపాధ్యాయులు తప్పనిసరిగా తాజా వైద్య ధ్రువపత్రాలు సమర్పించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల కోసం బుధవారం తిరుపతి రుయా వైద్యశాలలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తిరుపతి జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి (డీఎస్ఈవో) కె.వి.ఎన్.కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత ఉపాధ్యాయులు ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. వైద్య కారణాలతో బదిలీల్లో ప్రాధాన్యత పొందాలనుకునే ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఈ వైద్యశిబిరంలో సంబంధిత వైద్యుల వద్ద పరీక్షలు చేయించుకుని ఆ మేరకు పొందిన వైద్య ధ్రువపత్రాలను బదిలీల్లో ఉపయోగించుకోవాలని సూచించారు. బదిలీల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీ వర్తింపజేయడానికి ఈ ప్రత్యేక వైద్య శిబిరం ద్వారా జారీ అయిన ధ్రువపత్రాలను మాత్రమే పరిగణలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు.

మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లిన దొంగలు

రాజంపేట టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణంలోని ఉప్పరపల్లెలో మంగళవారం ఉదయం సరస్వతి అనే మహిళ మెడలోని గొలుసును దొంగలు లాక్కెళ్లినట్లు బాధితురాలు మన్నూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఉప్పరపల్లెలో ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు అడ్రస్సు అడుగుతూ వచ్చారు. అందుకు సరస్వతి అనే మహిళ సమాధానం ఇస్తున్న సమయంలో మెడలో సుమారు రూ.2 లక్షల విలువ చేసే 25 గ్రాముల తాళిబొట్టు సరుడును లాక్కెళ్లారు. ఆమె ఫిర్యాదు మేరకు మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఫారంపాండ్ పనులను పరిశీలించిన పీడీ


పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

గాలివీడు, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూలివీడు గ్రామం చీమలచెరువుపల్లిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన ఫారం పాండు పనులను మంగళవారం ఉపాధి పీడీ వెంకటరత్నం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఫారంపాండు పనులు చేపట్టిందని ఈ పనులు వలన రైతులకు నీటి నిల్వలు ఉండి అవసరమైన సమయంలో నీటి ఎద్దడి లేకుండా ఉపయోగపడుతుందని తెలిపారు. భూమిలోని నీటి నిల్వలు పెరిగి భూసారం పెరుగుతుందని రైతులకు వివరించారు. పనులకు హాజరైన వేతనదారులు, వారికి ఇచ్చిన కొలతల ప్రకారం పని చేసుకుని రోజుకి సగటు 300 రూపాయలు పొందే విధంగా పనులు చేయాలని వేతనదారులకు, సిబ్బందికి సూచించారు. అంతేగాక ఉపాధి హామీ పథకం అమల్లో పూర్తిగా పారదర్శకత పాటించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అత్యధిక పనిదినాలు కల్పించి ఆర్థిక భరోసా కల్పించాలని ఏపీవోలకు సూచించారు. ఆయన వెంట ఏపీవోలు హరిబాబు, రామచంద్ర, టీఏఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

దేవరరాయి హుండీ ఆదాయం లెక్కింపు

సంబేపల్లె, మే 20 (ఆంధ్రజ్యోతి): దేవరరాయి నల్లగంగమ్మ తల్లి హుండీ ఆదాయం రూ.3,23,797 వచ్చినట్లు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య తెలిపారు. ఆలయ సిబ్బంది పోలీసుల పర్యవేక్షణలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు తెలిపారు. హుండీ ద్వారా వచ్చిన ఆదాయం మొత్తాన్ని బ్యాంకులో జమ చేస్తున్నట్లు తెలిపారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

నందలూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన గొల్ల శ్రావణి (19), విఘ్నేశ్వరన్ (21) ప్రేమ పెళ్లి చేసుకుని స్థానిక పోలీసులను ఆశ్రయించిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఇద్దరూ మేజర్లు కావడం, పరస్పరం ఇష్టపడటంతో వివాహం చేసుకున్నామని పోలీసులకు తెలిపారు. దీంతో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఇరువురు కుటుంబాలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపినట్లు తెలిపారు.

నా భర్త ఆచూకీ తెలపండి సారూ...


మాట్లాడుతున్న రాజేశ్వరి

రాజంపేట టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ పోషణ కోసం కువైత్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న తన భర్త ఆచూకీ తెలియడం లేదని ఆయన భార్య రాజ్యబోయిన రాజేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే... పెనగలూరు మండలం చక్రంపేట గ్రామానికి చెందిన మనోహర్ కుటుంబ సభ్యులు రాజంపేట రామ్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. జీవనోపాధి కోసం కువైత్‌కు వెళ్లిన మనోహర్ తన కుటుంబ సభ్యులను చూసేందుకు ఈనెల 17న శ్రీలంక ఎయిర్‌లెన్స్ విమానంలో ఇంటికి బయలు దేరాడు. ఇండియాకు వస్తున్నట్లు భార్య రాజేశ్వరికి ఫోన్ ద్వారా తెలిపారు. తన భర్త మూడు రోజులైనా ఇంటికి చేరుకోకపోవడంతో మీడియాను సంప్రదించారు. తన భర్తకు ఫోన్ కూడా కలవడం లేదని, ఆందోళనగా ఉందన్నారు. తన భర్త ఆచూకీ తెలపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లను మీడియా ద్వారా వేడుకున్నారు.

ఘనంగా ఏనుగు మల్లమ్మ జాతర


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

బి.కొత్తకోట, మే 20 (ఆంధ్రజ్యోతి): హార్సిలీహిల్స్‌లో ఏనుగుమల్లమ్మ జాతర సందర్భంగా మంగళవారం ఉదయం అమ్మవారిని దివ్యంగా అలంకరించారు. పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటావూరు, బయప్పగారిపల్లి తదితర గ్రామాలకు చెందిన భక్తులు జ్యోతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రోజంతా భజనలు, కోలాటలు, మేళ తాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. తీర్థప్రసాద వినియోగం, అన్నసంతర్పణ ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగురంగుల పుష్పాలు, విద్యుత్‌దీపాలతో సుందరంగా అలంకరించిన హంసవాహనంపై అమ్మవారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి కొండపై ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త మదన్‌మోహన్‌రెడ్డి, రాజారెడ్డి, విజయారెడ్డిల ఆధ్వర్యంలో జాతర వైభవంగా జరిగింది.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



పీలేరు, మే 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై చిత్తు కాగితాలు ఏరుకునే ఓ గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు పీలేరు ఎస్ఐ లోకేశ్ తెలిపారు. పీలేరు-మదనపల్లె మార్గంలోని బ్రిడ్జి వద్ద సోమవారం మధ్యాహ్నం స్పృహ తప్పి పడిపోయిన అతనిని కొంతమంది పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం కన్నుమూశాడని ఎస్ఐ తెలిపారు. మరణించిన వ్యక్తి వయస్సు 40-45 ఏళ్ల మధ్య ఉంటుందని, అతని గురించి తెలిసిన వారు 9440796744, 9440796745 నెంబర్లకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బీజేపీ వర్గీయులపై కత్తులతో వైసీపీ వర్గీయుల దాడి



గ్రామంలో విచారిస్తున్న ఎస్ఐ, తలకు గాయాలతో శ్రీనివాసులరెడ్డి

ముద్దనూరు మే 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి చిన్నదుద్యాల గ్రామంలో మంగళవారం ఉదయం బీజేపీ వర్గీయులపై వైసీపీ వర్గీయులు కత్తులతో దాడి చేసినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. సీఐ సమాచారం మేరకు వివరాలు... చిన్నదుద్యాల గ్రామానికి సంబంధించిన మంచినీటి బోరు మోటారు మరమ్మతుకు గురికావడంతో గ్రామంలో మంచినీటి సమస్య ఏర్పడింది. దీంతో గ్రామంలోని బీజేపీ నాయకులు వెంకటేశ్వర్లరెడ్డి, మరికొందరు గ్రామస్తులు గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై గ్రామ సర్పంచ్ వరప్రసన్న భర్త మదన్‌మోహన్‌రెడ్డికి పంచాయతీ కార్యదర్శి సమాచారం అందించారు. అయితే వారు పట్టించుకోక పోవడంతో బీజేపీ నాయకులు వెంకటేశ్వర్లరెడ్డికి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనుమతి తీసుకొని బోరు మరమ్మతు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఈ మేరకు వెంకటేశ్వర్లరెడ్డి ఉదయం బోరు బండిని పిలిపించి మరమ్మతులు చేయిస్తుండగా.. వైసీపీ సర్పంచి భర్త మదన్‌మోహన్‌రెడ్డి అక్కడకు మరో బోరు బండిని తీసుకువచ్చి సర్పంచ్ మేమని.. నీవు బోరు మరమ్మత్తులు చేస్తావంటూ బెదిరించాడు. అధికారుల అనుమతితో పనులు చేస్తున్నామని వెంకటేశ్వర్లరెడ్డి చెప్పడంతో ఇరువురు మధ్య మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసింది. కొద్ది సేపటి తరువాత రెండు బైకుల్లో మదన్‌మోహన్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, ప్రసాదరెడ్డిలు కొడవళ్లు తీసుకు వచ్చి వెంకటేశ్వర్లరెడ్డిపై దాడికి పాల్పడగా స్వల్ప గాయంతో తప్పించుకున్నాడు. ఆ వెంటనే మరోసారి దాడి చేయగా వెంకటేశ్వర్లరెడ్డి తమ్ముడు శ్రీనివాసులరెడ్డి అడ్డుకోవడంతో అతని చేతులకు, తలకు గాయాలయ్యాయి. సమాచారం అందిన వెంటనే ఘటనా స్థలానికి పోలీసులు చేరుకోగా ముగ్గురు నిందితులు పరారయ్యారు. వెంకటేశ్వర్లరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, గాయపడిన శ్రీనివాసులరెడ్డిని చికిత్స నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ, ఎస్ఐలు తెలిపారు.

51 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



బియ్యం లోడుతో పట్టుబడిన వాహనం

దువ్వూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రబల్లి సమీపంలో మంగళవారం అక్రమం గా తరలిస్తున్న 51 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ వినోద్‌కుమార్ వివరాల మేరకు.. ఎం.సురేంద్ర అనే వ్యక్తి ఎర్రబల్లె ప్రాంతం నుంచి 51 బస్తాల రేషన్ బియ్యాన్ని సేకరించి బొలేరో వాహనంలో ఆళ్లగడ్డకు తరలిస్తుండగా.. ముందుగా అందిన సమాచారం మేరకు దాడి చేశామని తెలిపారు. వాహనంతో పాటు తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశామన్నారు. 2,400 కిలోల బరువుగల 51 ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు. దాడిలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏడుగురు జూదరులు అరెస్ట్

సింహాద్రిపురం, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రహారం గ్రామంలో మంగళవారం ఏడుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రవి కుమార్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 5159 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే బలపనూరు గ్రామంలో ఓ వ్యక్తి తన ఇంటి వద్ద మద్యం బాటిళ్లు అమ్ముతుండగా అతన్ని అదుపులోనికి తీసుకుని 10 బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైభవంగా పుష్పయాగం





శ్రీదేవి, భూదేవి సమేత నారాపురం వేంకటేశ్వరస్వామికి పుష్పయాగం నిర్వహిస్తున్న వేద పండితులు, పాల్గొన్న భక్తులు

జమ్మలమడుగు, మే 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారికి అంగరంగ వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల చివరి రోజైన మంగళవారం ఉదయం 11 గంటలకు ఆలయంలో పండితులు హోమం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు హాజరై శ్రీవారినిదర్శించుకున్నారు. అనంతరం అన్నమాచార్య కీర్తనలు జరిగాయి. సాయంత్రం 7 గంటలకు నారాపురం వేంకటేశ్వరస్వామికి పుష్పయాగం నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళా భక్తులు పాల్గొన్నారు. పుష్పయాగానికి వివిధ రకాల పూలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, పండితులు, భక్తులు పాల్గొన్నారు.

అధైర్యపడద్దు... అండగా ప్రభుత్వం : బీటెక్ రవి



యురేనియం టైలింగ్ పాండ్‌ను పరిశీలిస్తున్న బీటెక్ రవి

వేముల, మే 20 (ఆంధ్రజ్యోతి): యురేనియం పరివాహక గ్రామాల ప్రజలు ఎవరూ అధైర్యపడద్దు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి అన్నారు. మంగళవారం యురేనియం టైలింగ్‌పాండ్‌ను ఆయన పరిశీలించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద నష్టపరిహారం, పునరావాసం కల్పించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా మన్నారు. టైలింగ్ పాండ్ ఎత్తును వెంటనే పెంచకపోతే వర్షపు నీరు ఎక్కువై ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతారన్నారు. వెంటనే టైలింగ్ పాండ్‌ను పునర్నిర్మించకపోతే యురేనియం కర్మా గారం మూతపడుతుందన్నారు. ఇక్కడి సమస్యలను సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పేర్ల పార్థసారధిరెడ్డి, పేర్ల శేషారెడ్డి, ట్రేడ్ యూనియన్ నాయకుడు శ్రీనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమజ్జయంత్యుత్సవాలు



ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహానికి పూజలు చేస్తున్న దృశ్యం

చక్రాయపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో సహాయ కమిషనర్ వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో హనుమజ్జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం అంజన్నకు లఘు పూర్ణాహుతి గావించారు. ఉదయం వేదపారాయణం, యాగశాల ప్రవేశం, జ్వాలా తోరణం, ఆరాధన, అగ్ని ప్రతిష్ట హోమం, మూలమంత్ర ఆవాహనం, సోమకుంభ ఆవాహనం, తిరుమంజనం, లఘుపూర్ణాహుతి, గోష్ఠి, అనంతరం తీర్థప్రసాదాలు వినియోగించారు. సాయంత్రం త్రికాల ఆరాధన, సుందరకాండ పారాయణం, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. యజ్ఞాచార్యులు ధర్మగిరి వేద పాఠశాల అధ్యాపకులు రామానుజాచార్యులు శిష్యబృందంచే స్వామివారి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజాస్వామి, ముఖ్య అర్చకులు రాగోపాల చార్యులు, వేదపారాయణ పండితులు రామ్మోహన్‌శర్మ, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

కార్మికవర్గాన్ని బానిసలుగా మారుస్తున్న మోదీ ప్రభుత్వం

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి



కడప కలెక్టరేట్ ఎదుట కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న దృశ్యం

కడప సెవెన్ రోడ్స్, మే 20 (ఆంధ్రజ్యోతి): కార్మికవర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్‌కోడ్‌లు తెచ్చిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి విమర్శించారు. కనీస వేతనం రూ.26వే లు చెల్లించాలని, కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరుతూ మంగళవారం కడప సబ్ కలెక్టరేట్ కార్యా లయం ఎదుట కార్మిక సంఘాలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ బ్రిటీష్ వారితో కార్మి కవర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు నాలు గు లేబర్‌కోడ్‌లు తెచ్చిందన్నారు. ఈ లేబర్ కోడ్‌ల వల్ల కార్పొ రేట్‌ల లాభాలు పెరిగి, కార్మికులు హక్కులు లేని బానిసలుగా మారిపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను సమ్మెల ద్వారా కట్టడి చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, అంగన్వాడీ యూనియన్, మున్సిపల్ యూనియన్, మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జి.వేణుగోపాల్, బి.దస్తగిరిరెడ్డి, వి.అన్వేష్, చంద్రారెడ్డి, వెంకట సుబ్బయ్య, బి.లక్ష్మీదేవి, రామకృష్ణారెడ్డి, రామ్మోహన్, కేశవ, గోపి, కె.సి.బాదుల్లా, మద్దిలేటి, సుబ్బరాయుడు, సుంకర రవి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా టూరిస్టు పోలీసు కేంద్రం



మూతపడిన టూరిస్ట్ పోలీసు కేంద్రం

ఒంటిమిట్ట, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట కోదండరామాలయం సమీపంలో ఏర్పాటు చేసిన టూరిస్ట్ పోలీసు కేంద్రం నిరుపయోగంగా మారింది. గత ప్రభుత్వం 2023లో కోదండ రామాలయం సమీపంలో టూరిస్టు పోలీసు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కొద్దిరోజుల పాటు సిబ్బందిని నియమించి భక్తులు, ప్రజలకు సేవలు అందించారు. అనంతరం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని బదిలీ చేయడంతో టూరిస్టు పోలీసు కేంద్రం మూతపడింది. ఈ భవనాన్ని ముందుగా టీటీడీ వారు బస్సు షెల్టర్ నిమిత్తం తాత్కాలికంగా నిర్మించారు. కొద్దిరోజుల తర్వాత పోలీసు అధికారులు భవనాన్ని స్వాధీనం చేసుకుని టూరిస్టు పోలీసు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం భక్త లు, ప్రయాణికులు ఒంటిమిట్టలో బస్సుషెల్టర్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ భవనం బస్సు షెల్టర్‌గాను, టూరిస్టు పోలీసు కేంద్రంగాను ఉపయోగపడడంలేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం మూతపడడంతో చుట్టూ పరిసరాలు కంపచెట్లు, పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. అధికారులు స్పందించి ఈ భవనం భక్తులకు, ప్రయాణికులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అవుట్ పోస్టుకు ఉపయోగించుకుంటాం

టూరిస్ట్ పోలీసు కేంద్రాన్ని పోలీసు త్వరలో అవుట్ పోస్టుగా ఉపయోగించుకుంటాం. గత ప్రభుత్వంలో ఆలయాల వద్ద టూ రిస్ట్ పోలీసు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అన్నిచోట్ల టూరిస్ట్ పోలీసు కేంద్రాల్లో సిబ్బందిని నియమించలేదు.

– బాబు, సీఐ, ఒంటిమిట్ట

ఉద్యోగం రాలేదనే.. మనస్థాపంతో యువతి ఆత్మహత్య

పులివెందుల, మే 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాల్‌రెడ్డి ఫంక్షన్ హాల్ వెనుకవైపునున్న ఓ వీధిలో స్వాతి (23) అనే యువతి మంగళవారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే.... స్వాతి బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తోంది. ఈ ప్రయత్నాల్లో తనకు కావాల్సిన టెక్నికల్‌లో కాకుండా నాన్ టెక్నికల్‌లో ఉద్యోగం వచ్చింది. దీంతో మనస్థాపంతో చెందిన స్వాతి బెడ్‌రూమ్‌లోకి వెళ్లి తలుపువేసుకుంది. ఎంత సేపటికి కూతురు బయటకు రాకపోవడంతో ఆమె తండ్రి వరప్రసాద్, తల్లి కళావతిలు ఇంటిలోకి వెళ్లి పరిశీలించగా ఉరివేసుకొని కనిపించింది. దీంతో వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. చుట్టుపక్కల వారు స్వాతి మృతదేహాన్ని కిందికి దించారు. ఈ విషయం తెలిసిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చాంద్‌బాష తెలిపారు.

నోటీసులు ఇవ్వకుండానే స్కూలును కూల్చారు

- న్యూమోడల్ ఇంగ్లీషు మీడియం హైస్కూలు నిర్వాహకురాలు షర్మిల



న్యూమోడల్ ఇంగ్లీషు మీడియం హైస్కూలును కూల్చివేసిన దృశ్యం



మీడియాతో మాట్లాడుతున్న స్కూలు నిర్వాహకురాలు

కడప క్రైం, మే 20 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని సీఎస్ కాంపౌండులో 35 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న న్యూమోడల్ ఇంగ్లీషు మీడియం హైస్కూలును తమకు ఎలాంటి నోటీసులు, సమాచారం ఇవ్వకుండానే కూల్చివేశారని ఆ స్కూలు నిర్వాహకురాలు షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్కూలు వద్ద ఆమె మీడియాతో మాట్లాడారు. 1969వ సంవత్సరంలో మైనార్టీ ఎడ్యుకేషనల్ సొసైటీ కింద న్యూమోడల్ స్కూలును ఇక్కడ నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం 250 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారన్నారు. అయితే తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే అర్ధరాత్రి స్కూలు భవనం కూల్చివేశారని.. దీంతో స్కూలులో ఉన్న ఫర్నీచర్ పూర్తిగా ధ్వంసమైందన్నారు. ప్రస్తుతం పదో తరగతి ఫలితాలు వచ్చాయని.. కొంత మంది సప్లిమెంటరీ పరీక్షలు కూడా రాస్తున్నారన్నారు. అయితే వారికి మార్కులిస్టులు, స్టడీ సర్టిఫికెట్లు ఇవ్వాలని తమను బిషప్ పిలిపించి అడిగాడని, అయితే స్కూలు విద్యార్థులు ఇబ్బందికి గురికాకూడదనే విషయంపై సమయం తీసుకున్నామన్నారు. అయితే ఇందుకు బిషప్ కూడా ఒప్పుకున్నారని, చర్చికి సంబంధించి ఎన్నికలు జరుపుతున్న నేపథ్యంలో ఎస్సీలకు సంబంధించి బీసీ సర్టిఫికెట్లు అడిగారని.. అయితే దానికి తాను ఒప్పుకోకపోవడంతో కక్ష గట్టి ఇలా తమ స్కూలును దౌర్జన్యంగా కూల్చివేశారని ఆరోపించారు. ఇలా చేయడం వల్ల దాదాపు 250 మంది విద్యార్థుల జీవితాలు నాశనం కావా అని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే కొంతమంది వైసీపీ పెద్దలు స్కూలు విక్రయించాలంటూ వస్తున్నారని, తాము ఎవరికీ ఇవ్వమని చెప్పడంతో.. ఇలా నానారకాలుగా బిషప్ వరప్రసాద్, అతని కుమారుడు ప్రశాంత్‌లు మానసికంగా ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆమె ఆరోపించారు. గతంలో కూడా ఇలాగే ఒత్తిడి తెచ్చారని, అయితే తాము కోర్టును కూడా ఆశ్రయించామన్నారు. ఈ నేపథ్యంలో ఎవరి అనుమతి లేకుండా స్కూలు భవనాన్ని కూల్చాల్సిన అవసరం ఏముందని ఆమె ప్రశ్నించారు. పాత రికార్డులను కూడా వారు తీసుకెళ్లారని, ఈ ఘాతుకానికి పాల్పడ్డవారిపై చర్యలు తీసుకుని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత ఉందని ఆమె అన్నారు. కాగా స్కూల్‌ను ధ్వంసం చేసినట్లు ఫిర్యాదు రావడంతో బిషప్ కొడుకు ప్రశాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. కాగా, సీఎస్ఐ చర్చి ఆవరణలోని హాస్టల్ గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో కూల్చివేశామని, ఈగదులలో నిర్వహిస్తున్న న్యూమోడల్ స్కూల్ అగ్రిమెంటు గడువు 2022తో ముగిసిందని సీఎస్ఐ రాయలసీమ డయాసిస్ సెక్రటరీ సి.సాల్మన్, ట్రెజరర్ కె.మేరీకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

రోడ్లు వేయరు.. గుంతలు పూడ్చరు

- ఏడాదిగా వేంపల్లె ప్రజల అవస్థలు



వేంపల్లెలో రోడ్డు పనులు నిలిచిపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగిన దృశ్యం



వేంపల్లె బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిలో గోతులు

వేంపల్లె, మే 20 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో గత ప్రభుత్వంలో చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులు ఎన్నికల నేపథ్యంలో అర్ధాంతరంగా నిలిపివేశారు. దీంతో నిత్యం ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. వేంపల్లెలో కడప-పులివెందుల రోడ్డులో మురు గు కాల్వలు, కొత్త సిమెంటు రోడ్డు నిర్మాణం ఏర్పా టు చేయాలని గత వైసీపీ ప్రభుత్వం నిర్ణయిం చింది. రోడ్లు విస్తరించి ఈ పనులు చేపట్టేందుకు చర్యలు చేపట్టింది. ఎన్నికలకు ఆరు నెలల ముందు పులివెందుల రోడ్డులోని ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి సిమెంటు రోడ్డు మొదలుపెట్టి కందుల కాంప్లెక్స్ వరకు ఒకవైపు నిర్మించారు. రెండో వైపున రోడ్డు నిర్మించాల్సి ఉంది. అలాగే నాలుగు రోడ్ల కూడలి నుంచి కడప రోడ్డులో హనుమాన్ జంక్షన్ వరకు రోడ్డు వేయాల్సి ఉంది. దీంతో పాటు రోడ్డుకు ఇరువైపుల మురుగు కాల్వలను పూర్తి చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఎన్నికలు సమీపించడంతో మురుగుకాల్వలు, రోడ్డు పనులను నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాట య్యాక ప్రజల విజ్ఞప్తి మేరకు పులివెందుల నియో జకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డికి విన్నవించారు. వారు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి కాంట్రాక్టర్‌తో పనులు చేయాలని కోరారు. అయితే పెండింగ్‌లో ఉన్న మురుగుకాల్వల పనులు చేసినప్పటికీ రోడ్డు పను లు చేపట్టలేదు. దీంతో రోడ్డు పనులు నిలిచిపోయి సరిగ్గా ఏడాది దాటిపోయింది.

ఎక్కడ పడితే అక్కడ గోతులు...

ఈ ఏడాది కాలంలో వేంపల్లెలోని ప్రధాన కడప- పులివెందుల రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఎక్కడ పడితే అక్కడ గోతులు ఏర్పడ్డా యి. గోతులను పూడ్చేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు ముందుకు రావడం లేదు. ఇదేమంటే కొత్త రోడ్డు శాంక్షన్‌లో ఉన్నందున పాత రోడ్డుకు మరమ్మతులు చేసేం దుకు నిధులు ప్రభుత్వం కేటా యించదని చెబు తున్నారు. దీంతో కొత్త రోడ్డు దేవుడెరుగు.. పాత రోడ్డులో కనీసం గుంతలనైనా పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

మినీ మహానాడులో తీర్మానం

వేంపల్లెలోని ప్రధానమైన కడప-పులివెందుల రోడ్డులో సిమెంటు రోడ్డు నిర్మాణం కోసం ప్రభు త్వానికి విజ్ఞప్తి చేయాలని మినీ మహానాడులో తీర్మానించారు. పులివెందులలో ఆదివారం టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి ఆధ్వర్యంలో జరిగిన మినీ మహానాడు కార్యక్రమంలో స్థానిక ప్రజల, నాయ కుల విజ్ఞప్తి మేరకు ఆ సమస్యను రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు.

చెట్టు ముందా.. బోర్డు ముందా..?



కలికిరి, మే 20 (ఆంధ్రజ్యోతి): ఇదేంటీ చెట్టు ముందా.. విత్తు ముందా.. అని కదా ఉండాల్సింది అనుకుంటున్నారా.. మదనపల్లె- తిరుపతి నాలుగు లేన్ల జాతీయ రహదారిపై సైనిక్ స్కూల్ సమీపంలో కడప వైపు నుంచి వచ్చే వాహనాలకు తిరుపతి, మదనపల్లె, కలికిరికి వెళ్లే మార్గాలను సూచించేందుకు ఏర్పాటు చేసిన సూచిక బోర్డును చూస్తే ఆ శీర్షిక కరెక్టే అని అంగీకరించక తప్పదు. రోడ్డు పక్కనున్న ఒక చింతచెట్టు వెనుక ఈ బోర్డు ఏర్పాటు చేయడంతో, అక్కడ ఏదో బోర్డు ఉందని సూచన ప్రాయంగా అర్థమైనా, అందులోని ఒక్క అక్షరం కూడా వాహనదారులకు కనిపించడం లేదు. దానిని ఎందుకలా అమర్చారోనని స్థానికులు విమర్శిస్తున్నారు.

ట్రాఫిక్ పద్మవ్యూహం



గుర్రంకొండ, మే 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సాయంత్రం వేళ ట్రాఫిక్ సమస్య ప్రయాణికులను వేధిస్తోంది. పట్టణంలోనుంచి కడప-బెంగుళూరు జాతీయ రహదారి వెళుతుండడంతో వాహనాల రద్దీ అధికంగానే ఉంటుంది ఈ పరిస్థితుల్లో బస్టాండులో ఆటోలు, జీపులు, ద్విచక్ర వాహనాలను అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. బస్టాండులోని మురుగు కాలువపై తోపుడుబండ్లు, రేకులషెడ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేసున్నారు. పార్కింగ్ ఏరియా లేకపోవడంతో ద్విచక్ర వాహనాలను ఎక్కడ పడితే అక్కడ నిలుపుతున్నారు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

హంద్రీ-నీవా లైనింగ్ పనులు పూర్తయ్యేలా చూడాలి

- జయచంద్రారెడ్డికి సీఎం సూచన



చంద్రబాబుకు సమస్యలను వివరిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, మే 20(ఆంధ్రజ్యోతి): హంద్రీ - నీవా కాంక్రీట్ లైనింగ్ పనులు పూర్తయ్యేలా చూడాలని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. అమరావతిలోని సచివాలయంలో మంగళవారం జయచంద్రారెడ్డి ముఖ్యమంత్రిని కలిశారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో హంద్రీ - నీవా కాంక్రీట్ లైనింగ్ పనులపై చంద్రబాబు ఆరా తీశారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 72 వేల సభ్యత్వాలు చేయించారని జయచంద్రారెడ్డిని అభినందించారు. అనంతరం కడపలో జరుగుతున్న మహానాడుకు కలిసికట్టుగా హాజరు కావాలని సూచించారు. నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలని, కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా వెన్నంటే ఉండాలని తెలియజేశారు. తంబళ్లపల్లె నియోజకవర్గానికి రావాలని జయచంద్రారెడ్డి కోరగా మహానాడు తర్వాత వస్తానని చెప్పారు. అనంతరం నియోజకవర్గ సమస్యల పై చంద్రబాబుకు వినతి పత్రాలు అందజేసి వివరించారు.

మహానాడు దిగ్విజయానికి సమాయత్తం కావాలి

- కట్టా దొరస్వామి నాయుడుతో నారా లోకేశ్



నారా లోకేశ్‌తో కట్టా దొరస్వామినాయుడు

ములకలచెరువు, మే 20(ఆంధ్రజ్యోతి): కడపలో జరగనున్న మహానాడు దిగ్విజయం కోసం పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ యువనేత కట్టా దొరస్వామి నాయుడుకు మంత్రి నారా లోకేష్ సూచించారు. విజయవాడలో మంగళవారం మంత్రి నారా లోకేశ్‌ను ఆయన కలిశారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లె నియోజవర్గ విషయాలను మంత్రి లోకేశ్‌కు వివరించగా, మహానాడు విజయవంతానికి కృషి చేయాలని ఆదేశించారు.

మహానాడు జనసమీకరణ కమిటీలో పీలేరు ఎమ్మెల్యే

కలికిరి, మే 20 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈ నెల 27 నుంచి మూడు రోజులపాటు జరుగనున్న టీడీపీ మహానాడు సభల నిర్వహణ, ఏర్పాట్ల కోసం పార్టీ ఏర్పాటు చేసిన 20 వివిధ రకాల కమిటీల్లో భాగంగా జనసమీకరణ కమిటీలో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డిని నియమించారు. మహానాడు చివరి రోజు 29న భారీ బహిరంగ సభ నిర్వహించనున్న విషయం తెలిసిందే. దీనికోసం జనసమీకరణ చేపట్టడానికి మంత్రులు గొట్టిపాటి రవికుమార్, ఎస్.సవిత, బీసీ జనార్దన రెడ్డి ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో బీద రవిచంద్ర, కాలవ శ్రీనివాసులు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, దేవినేని ఉమా, ప్రత్తిపాటి పుల్లారావు, ఎన్.అమరనాథ రెడ్డితో సహా పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డిని నియమించారు. ఈ కమిటీలో కడప, అన్నమయ్య జిల్లాల నుంచి కిశోర్‌కుమార్ రెడ్డిని, తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి అమరనాథ రెడ్డిని మాత్రం నియమించారు.

ఆడపిల్లల పట్ల వివక్ష తగదు

రామాపురం, మే20(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లల పట్ల వివక్ష తగదని సీడీపీవో పద్మావతి అన్నారు. కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ సూర్యనారాయణ పురంలో మంగళవారం జరిగిన కిశోర బాలికల వికాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సూపర్‌వైజర్లు హుస్సేనమ్మ, పద్మజారాణి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్ వినతులను వెంటనే పరిష్కరించాలి: జేసీ



రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

నిమ్మనపల్లి, మే 20(ఆంధ్రజ్యోతి): పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టం ద్వారా వచ్చే వినతులను త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ సూచించారు. మంగళవారం తహసీల్దార్ అమరనాథ్‌తో కలసి రెడ్డివారిపల్లి గ్రామ పంచాయతీలో భూ రీ సర్వేను పరిశీంచారు. అక్కడి రైతులతో మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది రైతులకు ముందుగా నోటీలు ఇచ్చారా, రీ సర్వేపై ఎలాంటి సందేహలు వున్నాయి అని అడిగారు. రెడ్డివారిపల్లిలోని 18వ నంబరు చౌక దుకాణాన్ని తనిఖీ చేసి స్టాకు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. పీజీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌డీటీ సిరాజ్, ఆర్ఐ రాంప్రసాద్, సర్వేయర్ గోపి, వీఆర్వో హేమాంబర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సరుకుల పంపిణీలో పారదర్శకత తప్పనిసరి

- జూలై 31 లోపు ఈకేవైసీ పూర్తి చేయాలి
- డీలర్లు పనివేళలు పాటించాలి
- అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించం
- పీలేరు తహసీల్దార్ భీమేశ్వరరావు



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న పీలేరు తహసీల్దార్ భీమేశ్వర రావు

పీలేరు రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకుల పంపిణీలో పారదర్శకత తప్పనిసరని పీలేరు తహసీల్దార్ భీమేశ్వర రావు అన్నారు. మంగళవారం పీలేరు తహసీల్దార్ కార్యాలయంలో పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ విజయకుమార్ రెడ్డి అధ్యక్షతన డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి నెలా 1వ తేదీ నుంచి 17 వరకూ రేషన్ షాపుల్లో సరుకుల పంపిణీ చేయాలని ఆదేశించారు. మండలంలోని 56 మంది డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సరుకులు పంపిణీ చేయాలన్నారు. ఎవరైనా కార్డుదారులను ఇబ్బందులకు గురిచేసినా, టైం అయిపోయిందని లేనిపోని కారణాలు సాకుగా చూపినా ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండలంలో 4 వేల మంది ఈకేవైసీ చేయించుకోలేదని తెలిపారు. డీలర్లు ప్రత్యేక చొరవ చూపి జూలై నెల 31వ తేదీ లోపు అందరితో ఈకేవైసీ చేయించాలని తెలిపారు. ఐదేళ్ల పూర్తైన వారందరి ఆధార్ కార్డు అప్‌డేట్ చేయించి ఈకేవైసీ చేయించాలన్నారు. లేదంటే ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రాయితీలు ఆగిపోతాయన్నారు. ప్రస్తుతం చౌకదుకాణాల ద్వారా బియ్యం, చక్కెర పంపిణీ చేస్తున్నామని, కంది పప్పు రెగ్యులర్‌గా రావడం లేదన్నారు. డీలర్లు నాసిరకం సరుకులు పంపిణీ చేయరాదని సూచించారు. కార్డుదారుల పట్ల ఎవరూ నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించరాదని తెలిపారు.

గుర్రంకొండ : రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు సరఫరా చేసే నిత్యావసరాలను సకాలంలో పంపిణీ చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశంలో మాట్లాడుతూ రేషన్ సరుకులను నిర్ణీత గడువులోగా పంపిణీ చేయాలన్నారు. ఈకేవైసీ పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ ఫజలుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: కార్డుదారులకు రేషన్ సరుకులను సకాలంలో పంపిణీ చేయాలని తహసీల్దారు హరికుమార్ ఆదేశించారు. మంగళవారం తహసీల్దారు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రేషన్ డీలర్లు నిత్యావసర సరుకులకు సకాలంలో డీడీలు చెల్లించాలన్నారు. స్టాకు పాయింట్ వద్ద బియ్యం తూకం చూసుకుని తీసుకోవాలని సూచించారు. ప్రతి చౌకదుకాణం వద్ద స్టాకు వివరాలు తెలిపే బోర్డులు ఉండాలని, అందులో ఎప్పటికపుడు స్టాకు వివరాలను నమోదు చేయాలన్నారు. నిత్యావసర సరుకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సివిల్ సప్లైస్ డిటీ భువనేశ్వరీ, రెవెన్యూ సిబ్బంది, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

కనుల పండువగా మారెమ్మ జాతర



దివ్వెలు, కలశాలు తీసుకు వెళుతున్న మహిళలు

రామసముద్రం, మే 20(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత మారెమ్మ జాతర సందర్భంగా పెద్దకురప్పల్లె పంచాయతీ తిరుమలరెడ్డిపల్లె గ్రామంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగించి, మేళతాళాలతో గ్రామం నుంచి ఊరేగింపుగా వెళ్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలోని సత్యమ్మ, సప్పలమ్మ, నరిడెమ్మ, నడివీధి గంగమ్మకు మహిళలు దీపాలు మోసి మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన ప్రభలో అమ్మవారిని ఆసీనులను చేసి పంచాయతీలోని మట్టవారిపల్లె, పెద్దకురప్పల్లె గ్రామాలలో ఊరేగించారు. ఈసందర్భంగా మహిళలు హారతులు పట్టి టెంకాయలు కొట్టి పూజలు చేశారు. విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన అమ్మవారి చిత్రం ఆకట్టుకుంది. మండలంతోపాటు, కర్ణాటక రాష్ట్రానికి చెందిన అధిక సంఖ్యలో హాజరయ్యారు.

నాలుగు నెలలుగా అందని వేతనాలు

- ఇబ్బందుల్లో ఉపాధి హామీ సిబ్బంది

పెద్దతిప్పసముద్రం మే 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న సిబ్బందికి నాలుగు నెలల నుంచి జీతాలు అందడం లేదు. గత ఫిబ్రవరి నుంచి ఇప్పటిదాకా తమకు వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం తమపై చిన్న చూపుచూస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడినా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ సమస్యలు తప్పినట్లేనని బావించామని, ఇప్పుడు కూడా అదే పరిస్థితి పునరావృతమైతే తాము కుటుంబాలను ఎలా నెట్టుకు రావాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు ఇవ్వకపోగా, ఉపాధి పనులు వేగవంతం చేయాలన్న అధికారుల ఒత్తిళ్లతో తాము సతమతమవుతున్నామంటున్నారు. కనీసం ఇప్పటికైనా జీతాలు చెల్లించాలని వారు కోరుతున్నారు.

హైవేపై ప్రయాణం ప్రమాదకరం

- జంగిల్ క్లియరెన్స్‌లో అధికారుల జాప్యం
- బెంబేలెత్తుతున్న ద్విచక్ర వాహనదారులు



మండల సరిహద్దు వద్ద రహదారిపైకి చొచ్చుకొచ్చిన ముళ్లచెట్లు



ప్రకృతివనం ఎదురుగా రోడ్డుపైకి వచ్చిన ముళ్ల పొదలు

మదనపల్లె టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి):నాగరికతకు చిహ్నాలైన జాతీయ రహదారి .మదనపల్లె- వాల్మీకిపురం మధ్య ప్రమాదకరంగా మారి ద్విచక్రవాహన దారులను బెంబేలెత్తిస్తోంది. ఈ మార్గంలో 20 కిలోమీటర్ల దూరానికి 22 చోట్ల స్పీడ్ బ్రేకర్లు ఉండడంతో, ద్విచక్ర వాహనాలు, ఆర్టీసీ బస్సుల్లో వెళ్లే వారి ఒళ్లు హూనం అవుతోంది. ఆరు నెలలుగా జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడంతో 20 కిలోమీటర్ల మార్గంలో పది చోట్ల ముళ్ల పొదలు ఏపుగా పెరిగి వాటి కొమ్మలు జాతీయరహదారిపైకి చొచ్చుకువచ్చాయి. దీంతో ఏదైనా వాహనం ఎదురుగా వస్తే రోడ్డు చివరగా వెళ్లే ద్విచక్ర వాహనదారులు గాయాల పాలవ్వాల్సి వస్తోంది. ఇటీవల రాత్రి పూట ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించ బోయి పలువురు ఈ ముళ్ల పొదలు తగిలి తీవ్రంగా గాయపడ్డారు. మదనపల్లె-వాల్మీకిపురం మండల సరిహద్దు, సీటీఎం గేటు- క్రాస్ మధ్య ఆర్‌వోబీ నిర్మాణం జరుగుతున్న ప్రాంతాలు, ప్రకృతి వనం ఎదురుగా, దుబ్బిగానిపల్లె బస్టాపు వద్ద ఇలా పలు చోట్ల ముళ్లకంపలు జాతీయరహదారిపైకి వచ్చాయి. ఇకనైనా ఆర్‌అండ్‌బీ అధికారులు జంగిల్ క్లియరెన్స్ పనులు చేయించాల్సి వుంది.

పీఎంఏవైకి 11,598 దరఖాస్తులు

పీలేరు రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆవాస యోజన పథకంలో భాగంగా పీలేరు నియోజకవర్గంలో 11,598 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్లు పీలేరు గృహ నిర్మాణ శాఖ ఇన్‌చార్జి డీఈ కే. రమణయ్య తెలిపారు. ఎ గుర్రంకొండ 1696 మంది, కేవీపల్లె 1075 మంది, కలకడ 1492 మంది, పీలేరు 4026 మంది, కలికిరి 1494 మంది, వాల్మీకిపురం 1815 మంది కొత్తగా ఇళ్ల కోసం ధరఖాస్తు చేసుకున్నట్లు ఆయన చెప్పారు. దరఖాస్తుదారులంతా యూడీఏ(అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) పథకంలో బాగంగా ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా ఉండదని, పూర్తిగా కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు.

హజ్ యాత్రికులకు ఆత్మీయ వీడ్కోలు



హజ్ యాత్రికులకు వీడ్కోలు పలుకుతున్న మంత్రి ఫరూఖ్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి హజ్ యాత్రకు బయలుదేరిన భక్తులకు రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి ఫరూఖ్‌తో కలసి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా వీడ్కోలు పలికారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హజ్ యాత్రికులు హైదరాబాద్‌లోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి వీరికి మంత్రి ఫరూఖ్, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు పఠాన్‌ఖాదర్‌ఖాన్ వీడ్కోలు పలికారు. హజ్‌యాత్రలో మక్కా, మదీనా, జెద్దా ప్రాంతాల్లో భక్తులకు అవసరమైన వసతి తదితర సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల ఆందోళన



ఆందోళన చేస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు

మదనపల్లె అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మదనపల్లె జిల్లా ఆస్పత్రి ఎదుట మంగళవారం తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. ప్రస్తుతం జీతం రూ. 8800 చెల్లిస్తున్నారని, కనీస జీతం రూ.18,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ కూడా డ్రైవర్ల ఖాతా నుంచే తీసుకుని జమ చేస్తున్నారని ఆరోపించారు. నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వి.కృష్ణప్ప, ఉపాధ్యక్షుడు గంగాధర్, ట్రెజరర్ శివ కుమార్, రెడ్డికుమార్, దర్బార్, సోకత్, శ్రీనివాసులు, శ్రీను, ముఖేష్, పృధ్వీరాజ్, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యయోధుల అడుగుజాడల్లో నడవాలి

మదనపల్లె టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల అడుగుజాడల్లో నడుచుకోవాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు సూర్యారావు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రైవేటు కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల నాలుగో రోజున సూర్యారావు అతిధిగా పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం 12వ తరగతి పాఠ్యపుస్తకాల్లో భగత్‌సింగ్ చరిత్రను తొలగించి ఆర్ఎస్ఎస్ అధినేత సావర్కర్ జీవిత చరిత్రను పొందుపరిచిందన్నారు. మహానాయకుల చరిత్రను తొలగించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్, అశోక్, నరసింహ, రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఏపీడీ విచారణ



కూలీలను విచారణ చేస్తున్న ఏపీడీ మధుబాబు

కలకడ, మే 20 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ముడియంవారిపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ భారతి పని తీరుపై ఏపీడీ మధుబాబు మంగళవారం విచారణ చేశారు. మస్టర్లలో బినామీ పేర్లు నమోదు చేసి అవినీతికి పాల్పడుతోందని గ్రామస్థులు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం ఏపీడీ గ్రామంలో పర్యటించి కూలీలు చేస్తున్న పనులు, మస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం కూలీలను అడిగి ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిపై వివరాలను సేకరించారు. కార్యక్రమంలో ఏపీవో సుజాత, గ్రామస్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

కలకడ, మే 20(ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరు పుస్తక పఠనాన్ని దినచర్యగా చేసుకుంటే విజ్ఞానం పెరుగుతుందని గ్రంథాలయాధికారి అమరనాథ్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలతోపాటు ఆట వస్తువులు అందుబాటులో ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి



ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మదనపల్లె అర్బన్, మే20(ఆంధ్రజ్యోతి):కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కార్మిక, ప్రజా, రైతు, వ్యవసాయ కార్మికులకు వ్యతిరేకంగా, ఆదానీ, అంబానీ వంటి కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మురళి ఆరోపించారు. మంగళవారం కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్స్ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు కార్మికులను బానిసలుగా మారుస్తోందని వివరించారు. 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆటో కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐలతో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయలన్నారు. రద్దు చేసిన భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల జీతాలను వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ముస్తాన్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ముబారక్, పట్టణ కార్యదర్శి తిరుమల, చలపతి, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి: సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

మదనపల్లె అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ భూముల కబ్జాపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం తమ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సీపీఐ నాయకులు కృష్ణప్ప, సాంబశివ, మురళి మాట్లాడుతూ మదనపల్లె పట్టణం, టీకేపల్లె రెవెన్యూ సర్వే నెంబర్ 552-1లో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిగా గుర్తించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయడం హర్షణీయం అన్నారు. మదనపల్లె పరిసర ప్రాంతాల్లో కోట్లు విలువ చేసే భూములు కబ్జాకు గురి అవుతున్నాయన్నారు. ఈ సర్వే నెంబర్‌పై పలుమార్లు అధికారులు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి స్పెషల్ డ్రైవ్ కింద అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను, వాగులను, వంకలను కాపాడాలని కోరారు. కోమటివాని చెరువులో 18 ఎకరాలు, స్వామి చెరువు, అమ్మచెరువు, కురవంక కాలువను పూర్తిగా ఆక్రమించి బిల్డింగ్‌లు కట్టేశారని తెలిపారు. వెంటనే ఆక్రమణలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిరుమల, మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలసిన టీడీపీ నేతలు



సీఎంతో శివరామప్రతాప్, రామకృష్ణాచారి

మదనపల్లె టౌన్, మే 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మదనపల్లె టీడీపీ పరిశీలకుడ శివరామ్‌ప్రతాప్, సీనియర్ నేత ఆర్‌కే రామకృష్ణ ఆచారి మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఉదయం విజయవాడలో సీఎంను కలసి మదనపల్లె పరిస్థితులను వివరించారు. మహానాడు విజయవంతానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషాతో కలసి పనిచేస్తున్నామని తెలిపారు.

మినీ మహానాడును విజయవంతం చేయండి

నిమ్మనపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): మదనపల్లిలో ఈ నెల 22న జరగబోయే మినీ మహానాడును విజయవంతం చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు పుర్రా వెంకటరమణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఈ నెల 27 నుంచి 29 వరకు కడపలో నిర్వహిస్తున్న మహానాడుకు ముందుగా ఈ నెల 22న మదనపల్లిలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మినీ మహానాడులో మండల నాయకులతో పాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మన్న, సుధాకర్‌రావు, విజయ్, రెడ్డెప్పరెడ్డి, భూపతి, చెంగ్రాయుడు, చంద్ర తదితరులు పాల్గొన్నారు.